సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00



'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'

కోవిడ్–19


# ఫారిన్ రిటర్న్డ్!

- భారత్ నుంచి పెద్ద ఎత్తున అంతర్జాతీయ ప్రయాణాలు
- 2008లో విదేశాల నుంచి వచ్చిన 52 లక్షల మంది
- 2018 సంవత్సరంలో 1.74 కోట్ల మంది రాక
- 2009లో 1.1 కోట్ల మంది వెళ్లగా, 2018లో 2.6 కోట్ల మంది విదేశాలకు..



## అంతర్జాతీయ ప్రయాణాల్లో చైనా, ఇటలీనే టాప్..

### కోవిడ్ విస్తృత వ్యాప్తికిదే కారణం




**సాక్షి, హైదరాబాద్:** ప్రపంచం కుగ్రామం కావడం కోవిడ్‌కు కలిసొచ్చింది. సీఎం కేసీఆర్ చెప్పినట్లు స్వాభిమానం ఎక్కువున్న ఈ వైరస్.. ఆహ్వానించగానే అంతర్జాతీయ ప్రయాణికుల ఒడిలో చేరింది. మన దేశంలోనూ అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్య నానాటికీ పెరగడంతో వారి ద్వారా సరిహద్దులు దాటి ఇక్కడికి వచ్చి భయాందోళనలకు గురిచేస్తోంది. అంతర్జాతీయ ప్రయాణిల సంఖ్యను పరిశీలిస్తే గత పదేళ్లలో ఇతర దేశాల నుంచి దేశంలోకి వచ్చిన వారి సంఖ్య మూడింతలు పెరిగింది. అధికారిక లెక్కల ప్రకారం 2008లో ఇతర దేశాల నుంచి మన భూభాగంపై అడుగు పెట్టిన వారు 52 లక్షల మంది అయితే, 2018లో ఏకంగా అది 1.74 కోట్లకు చేరింది. దీంతోపాటు మన దేశం నుంచి ఇతర దేశాలకు వెళ్లిన వారు 2009లో 1.1 కోట్లుగా నమోదైతే, 2018లో ఆ సంఖ్య 2.6 కోట్లకు చేరింది. అంతర్జాతీయ ప్రయాణికుల ద్వారానే దేశంలోకి కోవిడ్ అడుగుపెట్టడం ఆందోళనకరం. ప్రపంచవ్యాప్తంగా కూడా ఇది విదేశీ ప్రయాణికుల ద్వారానే పాకింది. చైనాలోని వుహాన్‌లో పుట్టిన ఈ వైరస్ విమానాల్లో ప్రయాణించి ప్రపంచ దేశాలను గడగడలాడిస్తోంది. చైనా, ఫ్రాన్స్, స్పెయిన్, అమెరికా, ఇటలీ, హాంకాంగ్, జర్మనీ, లండన్ తదితర దేశాలు అంతర్జాతీయ ప్రయాణికుల విషయంలో అగ్రభాగాన నిలవగా, అందులోని మెజారిటీ దేశాలు కోవిడ్‌తో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి.



# అవాస్తవాలు.. అర్ధ సత్యాలు

## కోవిడ్‌పై సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు

**ప్రతి 15 నిమిషాలకు నీళ్లు తాగాలని, పసుపు తింటే తగ్గుతుందని వదంతులు**

**ఫ్లూ వైరస్ కంటే ప్రమాదం కాదంటూ నిర్లక్ష్యపు పోస్టింగ్‌లు..**

**వాట్సాప్‌లో చక్కర్లు కొడుతున్న మెసేజ్‌లు, వాటికి జవాబులివీ..**

సాక్షి, హైదరాబాద్

సామాజిక మాధ్యమాలు కోవిడ్ వ్యాప్తిపై ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నాయి. అవాస్తవాలు, అర్ధ సత్యాలతో కూడిన పోస్టింగ్‌ల కారణంగా ఏది నమ్మాలో ఏది నమ్మకూడదో అర్థం కాక ప్రజలు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ సామాజిక మాధ్యమాల ద్వారా వైరస్ వ్యాపించకుండా అప్రమత్తమయ్యే పోస్టింగులే కాకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే పోస్టింగులు కూడా వైరల్ అవుతున్నాయి. ప్రతి 15 నిమిషాలకు నీళ్లు తాగితే సరిపోతుందని, పసుపు తింటే తగ్గిపోతుందని వస్తున్న పోస్టింగుల్లో ఎలాంటి వాస్తవం లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అందుకే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కొన్ని అర్ధసత్యాలు, అవాస్తవాలు, వాటికి సమాధానాలు.. చదువుకోండి.. ప్రాక్టికల్‌గా ఉండి స్వీయ నియంత్రణ పాటించి కోవిడ్ మహమ్మారి దరిచేరకుండా జాగ్రత్త పడండి.



**సోషల్ మీడియా: నీళ్లు తాగితే చాలు**

**వాస్తవం:** ప్రతి 15 నిమిషాలకోసారి నీళ్లు తాగడం వల్ల గొంతు ద్వారా ఎలాంటి వైరస్ కూడా శరీరంలోకి వెళ్లదని సోషల్ మీడియాలో ఓ పోస్టింగ్ చక్కర్లు కొడుతోంది. దీనికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాల్లేవు. తరచుగా నీళ్లు తాగడం మంచిదే. కానీ శ్వాస సంబంధిత వైరస్‌ల వ్యాప్తిని నిరోధిస్తుందనడంలో శాస్త్రీయత లేదు.

**సోషల్ మీడియా: ఉప్పు నీళ్లు పుక్కిలిస్తే చాలు..**

**వాస్తవం:** ఉప్పు నీళ్లు శ్వాస సంబంధిత వైరస్‌లను నియంత్రించలేవు. బ్లీచింగ్ పౌడర్, ఇథనాల్ లాంటివి పుక్కిలిస్తే ప్రయోజనం ఉంటుందన్న పోస్టుల్లోనూ వాస్తవం లేదు. పైగా అది చాలా ప్రమాదకరం. అతి చల్లని, అతి వేడి వాతావరణం కూడా వైరస్‌ను చంపేస్తుందనడం కూడా శాస్త్రీయంగా నిరూపణ కాలేదు.

**సోషల్ మీడియా: పసుపు తింటే తగ్గిపోతుంది..**

**వాస్తవం:** పసుపులో రోగనిరోధక శక్తి ఉంటుందని మాత్రమే ప్రపంచ ఆరోగ్య సంస్థ ధ్రువీకరించింది. కోవిడ్‌ను నియంత్రిస్తుందనేందుకు కూడా ఎలాంటి ఆధారాల్లేవు. సాధారణంగా వైరస్‌లను ఫలానా పదార్థం నియంత్రిస్తుందనేది ఇంతవరకు ఎక్కడా నిరూపణ కాలేదు.



**సోషల్ మీడియా: 10 సెకన్ల పాటు ఊపిరి బిగపట్టగలిగితే ప్రమాదం లేనట్టే**

**వాస్తవం:** దగ్గకుండా.. ఎలాంటి అసౌకర్యం లేకుండా 10 సెకన్ల పాటు ఊపిరి బిగపట్టగలిగితే కోవిడ్ నుంచి ఎలాంటి ప్రమాదం లేనట్లేనని సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న విషయాల్లో వాస్తవం లేదు. మీరు 10 సెకన్ల పాటు ఊపిరి బిగపట్టగలిగినా మీకు కోవిడ్ సోకదనడం సరైంది కాదు.

**సోషల్ మీడియా: సాధారణ ఫ్లూ వైరస్‌ల కంటే ప్రమాదం కాదు..**

**వాస్తవం:** ఈ వైరస్ సాధారణ ఫ్లూ వైరస్‌ల కన్నా 10 రెట్లు ప్రమాదకరం.

**సోషల్ మీడియా: మాస్కులు వైరస్‌ను నియంత్రించలేవు..**



**వాస్తవం:** మాస్కులు 100% వైరస్‌ను నిరోధించలేవు. కానీ వైరస్ వ్యాప్తి చెందే అవయవాలను మాస్కులతో కప్పి ఉంచడం వల్ల తుమ్ములు, దగ్గుల ద్వారా వ్యాప్తి చెందుతున్న కోవిడ్‌ను నియంత్రించేందుకు ఉపయోగపడతాయి. ఈ వైరస్ సోకిన వారు తుమ్ములు, దగ్గులు వస్తున్న వారు మాస్కు లు ధరించడమే ఉత్తమం. ఏదేమైనా ఎన్–95 లాంటి నాణ్యమైన మాస్కులు ధరించడం వల్ల ఎంతో కొంత ప్రయోజనమే కానీ నష్టమేమీ లేదు.




**సోషల్ మీడియా: వెండి పూత నిరోధిస్తుంది.**

**వాస్తవం:** ఒక అమెరికన్ వెండిపూతను నీటిలో కలుపుకొని తాగడం వల్ల 12 గంటల్లో వైరస్ చనిపోతుందని, రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తప్పుడు ప్రచారం వెలుగులోకి తెచ్చారు. ఐరన్, జింక్ లాగా మానవ శరీరంపై వెండి ఎలాంటి ప్రభావం చూపించలేదు. పైగా వెండి శరీరంలోకి వస్తే మూత్రపిండాలు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది.

**సోషల్ మీడియా: మరికొన్ని నెలల్లో వ్యాక్సిన్ అందుబాటులోకి..**



**వాస్తవం:** ఈ కోవిడ్‌కు విరుగుడుగా వ్యాక్సిన్ మరికొన్ని నెలల్లోనే అందుబాటులోకి వచ్చే పరిస్థితి లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇందుకు సంబంధించిన పరీక్షలు జరుగుతున్నాయని, అయితే అవి జంతువులు, మానవులపై క్లినికల్ ట్రయల్స్ నిర్వహించే దశలోనే ఉన్నాయని, మరో ఏడాది వరకు ఈ వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చినా తొందరగా వచ్చినట్లేనని వారు చెబుతున్న మాట.

### ప్రాక్టికల్‌గా ఉండాలి..

వీటితో పాటు చాలా మెసేజ్‌లు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. వీటిలో స్థానికంగా జరుగుతున్న కొన్ని కార్యక్రమాలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతున్న విషయాలు తప్ప మిగిలిన వాటిలో వాస్తవం చాలా తక్కువ. అందుకే సోషల్ మీడియాపై పూర్తిగా ఆధారపడకుండా దగ్గు, జలుబు, జ్వరం లక్షణాలు కన్పిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం, అవసరమైతే హోం క్వారంటైన్ కావడం, టెస్టులు చేయించుకోవడమే ఉత్తమ మార్గం. ఇంకో విషయం ఏంటంటే.. కోవిడ్ గురించి తప్పుడు ప్రచారం చేసినా, ప్రజల్లో భయాందోళనలు కలిగించే ప్రయత్నం చేసినా చట్టపరంగా శిక్షార్హులు.

---

# వర్క్ ఫ్రం హోం!

**కోవిడ్‌పై ఐటీ సంస్థల అప్రమత్తం**

**'ఇంటి నుంచే పని' వెసులుబాటు కల్పించిన పలు సంస్థలు**

**ఆఫీసుకు వచ్చే ఉద్యోగులకు శరీర ఉష్ణోగ్రత పరీక్షల నిర్వహణ**

**ప్రైవేటు హాస్టళ్ల మూసివేతతో బ్యాచిలర్ ఉద్యోగుల అగచాట్లు**

**2,000**
చిన్నాపెద్దా కలిపి హైదరాబాద్‌లోని మొత్తం ఐటీ సంస్థలు..


**5,50,000**
ఇందులో పనిచేస్తున్న మొత్తం ఉద్యోగుల సంఖ్య..

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో కోవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు ఐటీ సంస్థల యాజమాన్యాల్లో ఆందోళన నెలకొంది. తమ ఉద్యోగులకు ఇంటి నుంచే పని చేసే (వర్క్ ఫ్రం హోం) వెసులుబాటును కల్పించిన ఐటీ సంస్థలు పరిస్థితి ఇలాగే కొనసాగితే వ్యాపార మనుగడపై ఆందోళన చెందుతున్నాయి. ఐటీ రంగానికి చిరునామాగా ఉన్న హైదరాబాద్‌లో సుమారు 2 వేలకు పైగా చిన్నా పెద్దా ఐటీ కంపెనీల్లో ఐదున్నర లక్షల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. మార్చి మొదటి వారంలో అతి పెద్ద ఐటీ హబ్ రహేజా మైండ్‌స్పేస్‌లో కోవిడ్ కలకలం మొదలవడంతో ఐటీ సంస్థలు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాయి. అమెజాన్ వంటి పెద్ద కంపెనీలు కూడా వర్క్‌ఫ్రం హోం వెసులుబాటును కల్పించగా, ఐటీ రంగానికి సంబంధించి సుమారు 60% మం ది ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నట్లు ఆ వర్గాలు చెప్తున్నాయి. అయితే కొన్ని మధ్య, చిన్న తరహా ఐటీ కంపెనీల్లో మాత్రం ఉద్యోగులు కార్యాలయాల నుంచే పని చేస్తున్నారు.

ఐటీ కంపెనీ కార్యకలాపాల్లో అత్యంత కీలకమైన క్లైంట్ మీటింగ్‌లను పూర్తిగా రద్దు చేయడంతో పాటు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించి నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఆన్‌సైట్ పేరిట ఇతర దేశాల్లో కార్యకలాపాలకు వెళ్లే ఉద్యోగులు, యజమానుల టూర్లు పూర్తిగా రద్దయ్యాయి. తొలుత చైనా, ఇరాన్, ఇటలీ, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియాకు టూర్లు రద్దు చేసిన సంస్థలు.. ప్రస్తుతం విదేశీ పర్యటనలకు పూర్తిగా దూరంగా ఉంటున్నాయి. నియామక ప్రక్రియకు తాత్కాలికంగా విరామం ఇవ్వడంతో ఉద్యో


### విదేశీ టూర్లు రద్దు..

గార్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఉద్యోగుల పని సామర్థ్యం తగ్గుతుందనే సాకుతో కొన్ని చిన్న, మధ్య తరహా ఐటీ కంపెనీలు 'వర్క్ ఫ్రం హోం'కు నిరాకరిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే ప్రైవేటు హాస్టళ్లలో ఉంటూ ఉద్యోగాలు చేస్తున్న బ్యాచిలర్లు ఇబ్బందులు పడుతున్నారు. హాస్టళ్ల మూసివేతతో స్థానికంగా ఉండే పరిస్థితి లేదని ఆందోళన చెందుతున్నారు.



### భవిష్యత్తుపై ఐటీ సంస్థలు, ఉద్యోగుల ఆందోళన

కోవిడ్ ప్రభావం ఇప్పుడిప్పుడే ఐటీ రంగంపై ప్రతికూల ప్రభావం చూపడం ప్రారంభమైందని నిపుణులు చెప్తున్నారు. ఇప్పటికిప్పుడు వ్యాపార పరంగా పెద్దగా ఇబ్బందులు లేవని నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీ (నాస్కామ్) వర్గాలు పేర్కొంటున్నాయి. చిన్న ఐటీ కంపెనీలు సిబ్బంది తగ్గింపు, వేతనాల్లో కోత, అన్‌పెయిడ్ హాలిడే వంటి ప్రత్యామ్నాయాల దిశగా ఆలోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం నెలకొన్న అనిశ్చితి కొద్దివారాల్లో తొలగిపోతుందనే ఆశాభావం ఐటీ వర్గాల్లో కనిపిస్తోంది. ఇదిలా ఉంటే కోవిడ్ నియంత్రణపై ఐటీ ఉద్యోగులకు అవగాహన కల్పించడంతో పాటు, ఐటీ వర్గాల్లో నెలకొన్న ఆందోళనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలంగాణ ఐటీ ఉద్యోగుల అసోసియేషన్ (టిటా) అధ్యక్షుడు సందీప్‌కుమార్ మక్తాల 'సాక్షి'కి వెల్లడించారు.



### ఐటీ కంపెనీల్లో కోవిడ్ జాగ్రత్తలు..

ఐటీ సంస్థల కార్యాలయాలను శానిటైజేషన్ చేయడంతో పాటు, సిబ్బందికి శానిటైజర్లు, మాస్కులతో కూడిన కిట్లు అందజేస్తున్నారు. కార్యాలయాల్లో పోస్టర్లు, బుక్‌లెట్ల ద్వారా కోవిడ్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉద్యోగులకు ఐటీ సంస్థలు అవగాహన కల్పిస్తున్నాయి. థర్మల్ స్క్రీనింగ్ యంత్రం ద్వారా ఉద్యోగుల శరీర ఉష్ణోగ్రతలు నమోదు చేస్తూ, దగ్గు, జలుబు, జ్వరం తదితర లక్షణాలతో ఉన్నవారిని వెనక్కి పంపిస్తున్నారు. కార్యాలయాల్లోనూ ఒకరికొకరు దూరంగా ఉండి కార్యకలాపాలు నిర్వర్తించేలా ఐటీ సంస్థలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి.


‘అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం’

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 12 | సంచిక: 361

SUNDAY Special | ఆదివారం 22-3-2020


నివేదితార్జునీయం

సూపర్ గ్రామర్

- నటుడు అర్జున్ దంపతులతో ‘సాక్షి’ ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ

- ఫ్యామిలీలో



మేరీకోమ్

బాధ్యతారాహిత్యం

- స్వీయ నిర్బంధంలో ఉండకుండా బయటకు..
- రాష్ట్రపతి ఇచ్చిన విందుకు హాజరు

- స్పోర్ట్స్‌లో



SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


మీడియాతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి ఈటల

# సకలం బంద్

## 24 గంటలు స్వచ్ఛంద కర్ఫ్యూ పాటించండి: సీఎం కేసీఆర్



## ఉదయం 6 నుంచి రేపు ఉదయం 6 వరకు..

- తెలంగాణ స్ఫూర్తిని చాటుదాం
- రాష్ట్ర ప్రజలకు సీఎం పిలుపు
- అత్యవసరాలను మినహాయించి టోటల్ షట్‌డౌన్ చేస్తున్నాం
- బస్సులు, మెట్రో రైళ్లు బంద్
- ఆస్పత్రులు, మెడికల్ షాపులు, పాలు, పండ్లు, కూరగాయలు, పెట్రోల్ బంకులు నడుస్తాయి
- ‘మహా’ సరిహద్దు మూసివేతపై ఒకట్రెండు రోజుల్లో నిర్ణయం
- ప్రజలు బయటకు రాని పరిస్థితి వస్తే ఇంటింటికి రేషన్!
- ప్రధానిని అవహేళన చేసిన వారిని అరెస్టు చేయాలి
- కోవిడ్–19 నియంత్రణ చర్యలపై విలేకరుల సమావేశం

సాక్షి, హైదరాబాద్

‘జనతా కర్ఫ్యూలో తెలంగాణ రాష్ట్రం యావత్ దేశానికి ఆదర్శంగా నిలవాలె. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు దేశ ప్రజలందరూ ఇళ్ల నుంచి బయటకు రాకుండా స్వచ్ఛందంగా జనతా కర్ఫ్యూ పాటించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు కర్ఫ్యూ పాటిద్దాం’అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కోవిడ్–19 వైరస్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యల గురించి శనివారం ప్రగతి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసీఆర్ వెల్లడించారు. అత్యవసర సేవలను మినహాయించి ఆదివారం టోటల్ షట్‌డౌన్ చేస్తున్నామన్నారు. జనతా కర్ఫ్యూను అందరూ పాటించాలని, 24 గంటలపాటు నియంత్రణ పాటించకపోతే ఏమీ సాధించలేమని చెప్పారు. 60 ఏళ్లు పోరాడి కోల్పోయిన రాష్ట్రాన్ని తిరిగి సాధించుకున్న తెలంగాణ జాతి స్ఫూర్తిని చాటాలని, కరోనా వైరస్ తెలంగాణ వారిని ఏం చేయలేకపోయిందనే పేరు తెచ్చుకోవాలన్నారు. అందరం కలిస్తే తప్ప కోవిడ్–19 నివారణ సాధ్యమయ్యే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ‘ఇప్పటికి మనం ఇలా ఉన్నం. రేపు ఏమైతదో

మిగతా 2వ పేజీలో ▶

నేడే జనతా కర్ఫ్యూ..

భారత్‌లో ఒక్కరోజులో 60 కేసులు

మొత్తంగా 283కు చేరిన కేసులు

ప్రపంచవ్యాప్తంగా 11వేలు దాటిన మృతుల సంఖ్య

- వివరాలు 8లో

## తొలిసారి స్థానిక వ్యక్తికి కోవిడ్

సాక్షి, హైదరాబాద్/ చాంద్రాయణగుట్ట

- దుబాయ్ నుంచి వచ్చిన బాధితుడి ద్వారా వ్యాప్తి
- బాధితుడి కుమారుడికే సోకినట్లు నిర్ధారణ
- దుబాయ్ నుంచి వచ్చిన మరో వ్యక్తికీ పాజిటివ్
- 21కి చేరిన కోవిడ్ పాజిటివ్ కేసులు
- రాష్ట్రంలో రెండో దశకు చేరుకున్న కోవిడ్ వ్యాప్తి

రాష్ట్రంలో తొలిసారిగా స్థానిక వ్యక్తికి కోవిడ్ పాజిటివ్ కేసు నమోదైంది. దుబాయ్ నుంచి వచ్చిన హైదరాబాద్ వ్యాపారి ద్వారా ఆయన కుమారుడి (35 ఏళ్లు)కి వైరస్ సోకినట్లు వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి. అయితే ఇప్పటివరకు విదేశాల నుంచి వచ్చిన వారికే పాజిటివ్ రావడం.. స్థానికంగా ఎవరికీ సోకకపోవడంతో డాక్టర్లు ధీమాతో ఉన్నారు. అయితే తొలిసారిగా స్థానికుడికి కూడా సోకడంతో ఇప్పుడు పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక అమెరికాలో క్రూజ్ ల్యాన్సర్‌లో పనిచేస్తున్న 33 ఏళ్ల వ్యక్తి దుబాయ్ మీదుగా హైదరాబాద్ వచ్చాడు. అతడికి కూడా పాజిటివ్ వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో రాష్ట్రంలో పాజిటివ్ కేసులు 21కి చేరాయి. కాగా, స్థానిక వ్యక్తికి కోవిడ్ అంటించిన వ్యాపారి ఈ నెల 14న దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చాడు. సికింద్రాబాద్‌కు చెందిన ఆ వ్యాపారికి 17న కోవిడ్ లక్షణాలు బయటపడ్డాయి. 19న కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారించారు. ఆ వ్యాపారి కుటుంబ సభ్యులు, సన్నిహితంగా మెలిగిన వారిని గుర్తించారు. వారందరినీ ఐసోలేషన్‌లో ఉంచారు. కోవిడ్ సోకిన వ్యాపారి కుమారుడి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్య వర్గాలు తెలిపాయి. కాగా, అతడు నివసించిన ప్రాంతానికి ఒక కిలోమీటరు పరిధిలో 50 బృందాలు ప్రతి ఇంటికి వెళ్లి కోవిడ్‌పై ఆరా తీయనున్నాయి. ఎవరికైనా కోవిడ్ లక్షణాలుంటే గాంధీ ఆస్పత్రికి తరలిస్తారు. ఒకవేళ లక్షణాలు

మిగతా 2వ పేజీలో ▶






## పీఎల్ఐ పథకాలకు కేబినెట్ ఆమోదం

- వివరాలు 8లో






## కోవిడ్ లక్షణాలుండి సహకరించకుంటే కేసు

- ఐసోలేషన్ లేదా ఆస్పత్రిలో చేరేందుకు నిరాకరిస్తే కఠిన చర్య
- అంటువ్యాధుల నియంత్రణ చట్టం –1897ను అమల్లోకి తెచ్చిన ప్రభుత్వం
- తెలంగాణ అంటువ్యాధుల (కోవిడ్) నియంత్రణ–2020 నోటిఫికేషన్ -12లో

అంతర్జాతీయ విమానాల

## నిలిపివేత

**అర్ధరాత్రి 1.30 గం. తర్వాత బంద్**

**శంషాబాద్:** కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున 5.31 గంటల తర్వాత విదేశాల నుంచి టేకాఫ్ తీసుకునే విమానాలకు దేశంలోని అన్ని విమానాశ్రయాల్లో ల్యాండింగ్ ఉండదని డీజీసీఏ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) ప్రకటించి.. ఉత్తర్వులు జారీ చేశారు. దేశంలో ఏ విమానాశ్రయం నుంచి కూడా ఆదివారం అర్ధరాత్రి 1.30 గం. తర్వాత అంతర్జాతీయ విమానాల ల్యాండింగ్‌కు అనుమతి లేదన్నారు. మార్చి 29 వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి నిత్యం 6 నుంచి 8 అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దవుతూ వస్తున్నాయి. శనివారం కూడా 8 అంతర్జాతీయ సర్వీసుల విమానాలు రద్దయ్యాయి.

1,640 నర్సుల పోస్టుల

## భర్తీకి అనుమతి

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా 1,640 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి ప్రభుత్వం శనివారం అనుమతిచ్చింది. ఏడాది పాటు లేదంటే డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమించుకునేంత వరకు ఔట్ సోర్సింగ్ పద్ధతిన తాత్కాలికంగా వీరి నియామకానికి అనుమతిస్తూ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో సిద్దిపేట మెడికల్ కాలేజీకి 361, ‘నీలోఫర్’కు 278, ఆదిలాబాద్ రిమ్స్‌కు 169, మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రికి 160, గాంధీకి 137, నిజామాబాద్ ప్రభుత్వ కళాశాలకు 121, ఉస్మానియాకు 104 పోస్టులతో పాటు వివిధ ఆసుపత్రులకు మిగిలిన వాటిని మంజూరు చేశారు.









epaper.sakshi.com





# అంటుకుంటే వదలదు...

**అక్షరాలా.. యాభై వేల కోట్లు!**

**కోవిడ్ బాధితుడి ఒక టీస్పూన్ లాలాజలంలో ఉండే కరోనా వైరస్‌ల సంఖ్య ఇది.**

**ఒక్క దగ్గు లేదా తుమ్ము చాలు.. ఈ వేల కోట్ల వైరస్‌లలో కొన్ని తుంపర్లతో కలిసి పరిసరాల్లోకి చేరిపోయేందుకు..**

**ఆ క్షణంలో ఒక్కసారి ఊపిరి పీల్చుకున్నా సరే.. కొంచెం అటు ఇటుగా 32,456 వైరస్‌లు నోరు, గొంతు పైపొరల్లోకి చేరిపోతాయి.**

**ఆ సెకను నుంచి శరీరంలో వైరస్‌లు ఇబ్బడిముబ్బడి కావడం మొదలవుతుంది.**

**ఆ తరువాత ఒక్కో దశలో ఏం జరుగుతుందో తెలుసుకుంటే.. కరోనా వైరస్ కట్టడికి ప్రభుత్వాలు ఇంతటి కఠిన చర్యలు ఎందుకు తీసుకుంటున్నాయో ఇట్టే అర్థమైపోతుంది.**


## తుమ్మినా... దగ్గినా..

కోవిడ్ బాధితుడు ఒక్కసారి తుమ్మినా, దగ్గినా కోటానుకోట్ల వైరస్‌లు పరిసరాల్లోని ఉపరితలాలపై చేరిపోతాయి. చేతిని అడ్డం పెట్టుకుని ఉంటే ఆ చేతులతో తాకిన ప్రతిచోటా వైరస్ ఉండిపోతుంది. ఉపరితలాన్ని బట్టి ఈ వైరస్ రెండు గంటల నుంచి మూడు రోజుల పాటు సజీవంగా ఉంటుందని ఇటీవలే అమెరికాలో జరిగిన పరిశోధన ఒకటి స్పష్టం చేసింది. అంటే.. తరచూ చేతులు శుభ్రం చేసుకుంటున్నా.. మనుషులకు మీటర్ ఎడంగానే ఉంటున్నా కొంచెం కష్టమైనా సరే.. బలవంతంగా చేతులను ముఖానికి తాకకుండా జాగ్రత్త పడుతున్నా కూడా వైరస్ బారిన పడే అవకాశాలు ఇంకా మిగిలే ఉంటాయన్నమాట. ఒక్కసారి ఒక వ్యక్తి శరీరంలోకి ప్రవేశించిన తరువాత వైరస్ ఎలా ప్రవర్తిస్తుంది? ఎంత చేటు తెస్తుందన్నది చూస్తే...



## మాట్లాడినా డేంజరే...

కోవిడ్ బాధితుడు ఒక్క మాట మాట్లాడితే చాలు.. అతడి గొంతు నుంచి పైకి వచ్చే గాలి ద్వారా వైరస్‌లతో కూడిన చిన్నచిన్న తుంపరలు బయటకు వచ్చేస్తాయి. కొన్ని వైరస్‌లు ఇతరులు తినే ఆహారంపై చేరిపోవచ్చు. మరికొన్ని వేళ్లమధ్యలో ఉండిపోవచ్చు. మరికొన్ని ముక్కు ద్వారా సైనస్‌లోకి చేరి మళ్లీ గొంతులో స్థిరపడిపోవచ్చు. ఈ దశలో ఒక్క షేక్‌హ్యాండ్ ఇచ్చినా సరే.. అవతలి వ్యక్తి చేతులపై కనీసం 43,654 వైరస్‌లు పోగుపడతాయని, షేక్‌హ్యాండ్ పూర్తయ్యేసరికి ఈ సంఖ్య 3,12,405కు చేరుతుందని అంచనా. ఇప్పుడు గొంతులో మిగిలిపోయిన వైరస్‌ల సంగతి చూద్దాం. కొన్ని వైరస్‌లు లాలాజలపు చుక్కలతో కలిసి ఊపిరితిత్తుల్లోని ఒక కొమ్మపై చేరిపోతాయి. వెచ్చగా, తడిగా ఉండే కణజాలంపై ఇబ్బడిముబ్బడిగా పెరుగుతాయి. ఈ వైరస్‌లు ఎంత సూక్ష్మస్థాయిలో ఉంటాయంటే.. మన వెంట్రుకను ఫుట్‌బాల్ మైదానం అంత సైజుకు పెంచితే వైరస్ సైజు నాలుగు అంగుళాలు మాత్రమే ఉండేంత!



---

## కోవిడ్ నియంత్రణకు సహకరించండి: కేటీఆర్



**సాక్షి, హైదరాబాద్:** కోవిడ్–19 వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యకలాపాలు నిర్వహించి సహకరించాలని ఐటీ కంపెనీలకు రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు సూచించారు. ఐటీ కంపెనీల్లో పారిశుద్ధ్యంతోపాటు ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాల్లో నిరంతరం థర్మల్ స్క్రీనింగ్ నిర్వహించాలన్నారు. ఇతర దేశాల్లో పర్యటించి వచ్చిన ఉద్యోగులు తప్పనిసరిగా క్వారంటైన్‌లో ఉండేలా చూడాలని కోరారు. ఇందుకు అవసరమైన వైద్య సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో వివిధ ఐటీ సంస్థలు, సంఘాలతో ఆయన శనివారం పరిమిత స్థాయిలో సమావేశమై పలు సూచనలు చేశారు.

## జనతా కర్ఫ్యూతో సమైక్య స్ఫూర్తిని చాటుదాం...



**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ వ్యాప్తి ప్రపంచాన్నే వణికిస్తున్న నేపథ్యంలో ప్రధాని మోదీ పిలుపు మేరకు జనతా కర్ఫ్యూ ద్వారా దేశ ఐక్యతను, సమైక్య స్ఫూర్తిని చాటుదామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ దేశాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచేలా మోదీ వివిధ కార్యక్రమాలను చేపడుతున్న ఒరవడిలోనే జనతా కర్ఫ్యూ ద్వారా మరో ప్రజోపయోగమైన ఆలోచనకు శ్రీకారం చుట్టారన్నారు. విపత్తును ఎదుర్కోవడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. జనతా కర్ఫ్యూను విజయవంతం చేసేందుకు బీజేపీ కార్యకర్తలు ఇందులో పాల్గొనాలని శనివారం కోరారు.

## అందరూ పాల్గొనాలి



**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ నియంత్రణలో భాగంగా ఆదివారం రాష్ట్ర ప్రజలంతా 'జనతా కర్ఫ్యూ'లో పాల్గొనాలని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. విదేశాల నుంచి వస్తున్న వారితో దేశంలో వేగంగా వైరస్ వ్యాప్తి చెందుతోందని, దీనికి నివారణే మార్గం కాబట్టి అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని శనివారం ఓ ప్రకటనలో కోరారు. అవసరమైతే స్వీయ ఐసోలేషన్‌కు వెళ్లాలని సూచించారు. జనతా కర్ఫ్యూ కారణంగా పేదలు, దినసరి కూలీలు ఇబ్బంది పడే అవకాశం ఉన్నందున తెల్లరేషన్ కార్డు ఉన్నవారిం దరికీ రేషన్ ఇంటికే సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. చిరుద్యోగులు ఫైనాన్స్ కంపెనీలకు చెల్లింపుల్లో కూడా వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## ఫార్మా కంపెనీల్లో శానిటైజర్లు, మాస్కులు తయారు చేయించండి



**సాక్షి, హైదరాబాద్:** కోవిడ్ వైరస్ నిర్మూలన కోసం రాష్ట్రంలోని ఫార్మా కంపెనీల్లో శానిటైజర్లు, మాస్కులను తయారు చేయించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ శాసన సభాపక్ష (సీఎల్పీ) నేత మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఫ్రాన్స్ లాంటి దేశాల్లో ఫార్మా కంపెనీలు వాటి ఉత్పత్తులను కూడా పక్కనపెట్టి శానిటైజర్లు, మాస్కులను తయారు చేస్తున్నాయని, వైరస్ వ్యాప్తిని నిరోధించే ఈ వస్తువులు అందుబాటులో ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని శనివారం ఆయన ఒక ప్రకటనలో కోరారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఇంటికే ఉచిత రేషన్ పంపిణీ, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవులు, అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స వసతి కల్పించాలన్నారు.

## స్వచ్ఛందంగా పాల్గొందాం



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో 24 గంటలపాటు జనతా కర్ఫ్యూ పాటించాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా ఇందులో పాల్గొనాలని, ఎవరికి వారే స్వచ్ఛందంగా బంద్ పాటించాలని అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్వీయ నియంత్రణ మనల్ని కాపాడుతుందని, మన కోసం, మన కుటుంబం కోసం, మన రాష్ట్రం, మనదేశం కోసం అందరం కలిసి జనతా కర్ఫ్యూలో స్వచ్ఛందంగా పాల్గొందామని సూచించారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు ఎవరూ ఇంటి నుంచి బయటకు రావొద్దని స్పష్టం చేశారు.

## విజయవంతం చేయండి



**సాక్షి, హైదరాబాద్:** ఆదివారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రజలెవరూ ఇళ్లల్లోంచి బయటకు రాకుండా జనతా కర్ఫ్యూ పాటించాలని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం విజ్ఞప్తి చేశారు. జనతా కర్ఫ్యూలో పార్టీ నాయకులు, కార్యకర్తలంతా పాల్గొనాలని, దీనిపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు. ప్రధాని మోదీ పిలుపునిచ్చిన జనతా కర్ఫ్యూలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## ఉద్యోగ సంఘాల మద్దతు

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వ్యాప్తిని నిరోధించేందుకు ఆదివారం తలపెట్టిన జనతా కర్ఫ్యూకు రాష్ట్రంలోని వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. ప్రజలంతా అప్రమత్తంగా ఉండి దేశాన్ని రక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు చిలగాని సంపత్‌కుమార్, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతరావు, సురేశ్, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.సదానంద్, పర్వత్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

---



శనివారం ప్రగతి భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో డీజీపీ మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ, మంత్రి ఈటల రాజేందర్, సీఎస్ సోమేశ్ కుమార్

# సకలం బంద్

▶ మొదటి పేజీ తరువాయి

చెప్పలేం. రేపు విజృంభించవచ్చు కూడా. విజృంభించకూడదంటే నియంత్రణ పాటించడమే శ్రీరామరక్ష'అని కేసీఆర్ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో కేసీఆర్ వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే...

**చీమ చిటుక్కు మనకూడదు..**

ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు తెలంగాణలో చీమ చిటుక్కుమనకూడదు. 100 శాతం ఆర్టీసీ బస్సులు, మెట్రో రైళ్లు మూసేస్తున్నం. ఒక్క బస్సూ నడవదు. ముందు జాగ్రత్త చర్యగా అత్యవసర పరిస్థితిలో వాడుకోవడానికి ప్రతి డిపోలో 5 బస్సులు, 10 మంది సిబ్బందితోపాటు హైదరాబాద్‌లో 5 మెట్రో రైళ్లను సిద్ధంగా ఉంచుతాం. వాటిని వైద్య, పారిశుద్ధ్య సిబ్బందిని తరలించడానికి వాడుకుంటం. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులనూ అనుమతించం. సరిహద్దుల్లోనే ఆపేస్తాం. ఎవరైనా వస్తే పోలీసులు పట్టుకుంటరు. కఠిన సమయంలో కఠినంగా ఉండాలి. సంకట పరిస్థితిలో స్వీయ నియంత్రణే కాపాడుతది. వర్తక, వాణిజ్య వర్గాలు దుకాణాలు, మాల్స్‌ను స్వచ్ఛందంగా మూసేయాలి. నిత్యావసర వస్తువుల కొరత రాకూడదని, చిన్న వ్యాపారాలు దెబ్బతినవద్దని, మాంసం, చేపలు, కూరగాయల దుకాణాల వంటి అసంఘటిత రంగ వ్యాపారాలు దెబ్బతినవద్దని వాటిని బ్యాన్ చేస్తలేం. ఆదివారం ఒక్క రోజు మాత్రం అందరూ స్వచ్ఛందంగా బంద్ పాటించాలి. ఆస్పత్రులు, మెడికల్ షాపులు, పాలు, పండ్లు, కూరగాయాలు, పెట్రోల్ బంకులు నడుపుకోవచ్చు. మీడియా మిత్రులు తిరగవచ్చు. అంబులెన్స్‌లు, ఫైర్ సర్వీస్, విద్యుత్, నీటి సరఫరా, సీవరేజీ సిబ్బంది, అత్యవసర సేవల సిబ్బంది మాత్రమే పనిచేస్తరు. మిగిలిన వారందరూ స్వచ్ఛందంగా ఎవరికి వారే మూసేయాలి. మనం, మన కుటుంబం, రాష్ట్రం, దేశం, ప్రపంచం, యావత్ మానవాళి కోసం 24 గంటలు ఏ వ్యక్తికావ్యక్తి కచ్చితంగా నియంత్రణ పాటించి ఇంట్లోనే ఉండాలి. ఇంటికి పనిమనుషులు, సేవకులు రావాలని అనుకోకండి. ఒక రోజు మీ పనులు మీరే చేసుకోండి. కూలీలు, కార్మికులూ 24 గంటలు ఇళ్లకే పరిమితం కండి. ఇవన్నీ పాటిస్తే కరోనా ప్రమాదం మనకు రాదు. ఈ మహమ్మారిని ఎదుర్కోవాలంటే కచ్చితంగా ఈ పని చేయాలి. నియంత్రణ పాటించని దేశాలు చాలా ఇబ్బందికి గురయ్యాయి. 60 ఏళ్ల పైబడినవారు, 10 ఏళ్లలోపు పిల్లలు దయచేసి 2–3 వారాలు బయటకు రాకండి. ప్రపంచవ్యాప్తంగా 60 ఏళ్ల పైబడిన వారు అత్యధికంగా చనిపోతున్నరు. 30, 40, 50 ఏళ్ల వారు, యువకుల మరణాలు లేవు.

**5 గంటలకు నేనూ చప్పట్లు కొడ్త..**

ఆదివారం సాయంత్రం 5 గంటలకు దేశ ప్రజలందరూ చప్పట్లు కొట్టి వైద్యులకు సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చిన ప్రధానిని అవహేళన చేసేలా కొందరు పనికిమాలిన వెధవలు వక్రబుద్ధితో సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. వారిని అరెస్టు చేయాలి. ప్రధాని ఎవరన్నది ముఖ్యం కాదు. ఆయన మన ప్రధాని.. గౌరవించాలి. నేను కూడా 5 గంటలకు బయటకు వచ్చి చప్పట్లు కొడ్తా. మా కుటుంబ సభ్యులు, మంత్రులు, ఎమ్మెల్యేలు చేస్తరు. ఎక్కడ ఉన్నోళ్లు అక్కడ 2 నిమిషాలు చప్పట్లు కొట్టాలి. మన ఐక్యతతో ఈ మహమ్మారి పారిపోవాలి. సరిగ్గా సాయంత్రం 5 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా సైరన్లు మోగించే ఏర్పాట్లు చేశాం. రాష్ట్రం నలుమూలలా ప్రజలు బయటకు వచ్చి 4 నిమిషాలు చప్పట్లు కొట్టాలి.

**వైద్య సిబ్బందిని కాపాడుకోవాలి..**

వైద్యులు, వైద్య సిబ్బందిని ఆరునూరైనా కాపాడుకోవాలి. రాష్ట్ర ప్రజల కోసం రాత్రింబవళ్లు కష్టపడుతున్న వారిని అభినందిస్తున్నం. ఇతర రాష్ట్రాల నుంచి మనకు వైద్యులు రమ్మంటే రారు. అందుకే వైద్యులకు అవసరమైన పీపీయూనిట్లు తెప్పించాం. ఇంకా తెప్పిస్తున్నాం. ఎన్ని వేల కోట్లు అయినా ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉన్నం.

**కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు**

కొందరు దుర్మార్గులు ఇటువంటి పరిస్థితిని అనుకూలంగా మార్చునేందుకు ప్రయత్నిస్తున్నారు. బ్లాక్ మార్కెటీర్లు, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం.

### ఆ సందర్భాలు ఏర్పడితే ఇళ్లకే రేషన్..

ప్రజలు బయటకు రాకూడని సందర్భాలు ఏర్పడితే ఇంటింటికీ రేషన్ ఎన్ని వాహనాలు అవసరమవుతాయి? ఎన్ని ఇళ్లకు పంపాలి అన్ని ఆలోచిస్తున్నం. అవసరమైతే రూ. వెయ్యి కోట్లు ఖర్చు చేసయినా రేషన్ అందిస్తాం. ఎలాంటి విపత్కర పరిస్థితి వచ్చినా తెలంగాణ బిడ్డలను కాపాడుకుంటాం. ప్రజలకు నయా పైసా కష్టం రానివ్వం. మందులు, నిత్యావసరాలు తదితరాలకు కేసీఆర్ బతికి ఉన్నంతవరకు 100% భరిస్తాం. రూ. 5 వేలు కోట్లు, రూ. 10 వేల కోట్లు ఖర్చయినా ప్రభుత్వమే ఆదుకుంటుంది.

### అవసరమైతే రాష్ట్ర సరిహద్దులు బంద్..

మహారాష్ట్ర మనకు పొరుగు రాష్ట్రం కావడం పెద్ద భయం. అక్కడ కోవిడ్–19 బాగా పెరుగుతోంది. మహారాష్ట్రతో మనకు ఐదారు వంద కిలోమీటర్ల సరిహద్దు ఉంది. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల ప్రజలకు మహారాష్ట్రలోని ధర్మాబాద్, నాందేడ్ వంటి ప్రాంతాల్లో ఎక్కువ బంధుత్వాలున్నాయి. మహారాష్ట్రలో వ్యాధి తీవ్రతపై ఒకటి రెండు రోజుల్లో సమీక్ష నిర్వహించి ఆ రాష్ట్రంతో సరిహద్దులు మూసేయాలని ఆలోచిస్తున్నం. ఆ రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలకు ముందు చెప్పి సరిహద్దులు మూసేస్తం. ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఎవరూ రాకుండా రాష్ట్ర సరిహద్దులను మూసేస్తాం. ఇప్పటికే పొరుగు రాష్ట్రాల ఉన్నతాధికారులతో ప్రధాన కార్యదర్శి, డీజీపీ నిరంతరం టచ్‌లో ఉన్నారు. ఢిల్లీతో కూడా ఎప్పటికప్పుడు సమాచారాన్ని పంచుకుంటున్నాం.

### కరీంనగర్ పూర్తిగా సురక్షితం..

కరీంనగర్‌లో శనివారం పర్యటించాలని అనుకున్నా. నాతోపాటు వచ్చే పోలీసులు, ఇతరులతో ప్రజలకు అసౌకర్యం కలగవద్దనే ఉద్దేశంతో రద్దు చేసుకున్నా. పట్టణంలో ఇప్పటివరకు 50 వేల మందికి వైద్య పరీక్షలు చేసినా ఒక్కరిలోనూ కోవిడ్ లక్షణాలు బయటపడలేదు. అయినా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. ఇండోనేసియాకు చెందిన వారితో ప్రయాణించిన ఆటో డ్రైవర్ సహా ఇప్పటివరకు ఎవరిలోనూ కోవిడ్ లక్షణాలు లేవు. ఎటువంటి పరిస్థితిని ఎదుర్కొనేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కరీంనగర్ పూర్తి సురక్షితం.

### సామాజిక సామరస్యానికి ముప్పులేదు...

రాష్ట్రంలో సామాజిక సామరస్యానికి ఎలాంటి ముప్పూ లేదు. ఇండోనేసియా నుంచి వచ్చిన వాళ్లు చొరబాటుదారులు కాదు. వీసా ద్వారానే ఇండియాకు వచ్చారు. తిరిగి వెళ్లిపోతారు. వాళ్లు ఏ తప్పూ చేయలేదు. వారి విషయంలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నాం. మీడియా అనవసర సమస్యలు సృష్టించొద్దు. ఆలయాల్లో ఎక్కడా పూజలు బంద్ చేయలేదు. నిత్య పూజలు, ఆరాధన యథాతథంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ సలహాదారు రమణాచారితో మాట్లాడాం. ఇతరులు చేసే హోమాలకు సహకారం లేదా ప్రభుత్వపరంగా హోమాలు చేసే అవకాశాన్ని పరిశీలిస్తాం. హోమాలు చేస్తే పరిమిత సభ్యులతో చేయాలి.

### సీసీఎంబీలో నిర్ధారణ పరీక్షలు..

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ (సీసీఎంబీ)లో కోవిడ్–19 వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నేను చేసిన విజ్ఞప్తిపట్ల సానుకూలంగా స్పందించి ఈ నిర్ణయం తీసుకున్నారు. రోజుకు వెయ్యి మందికి కోవిడ్–19 పరీక్షలు నిర్వహించే సామర్థ్యం సీసీఎంబీకి ఉంది. రోగుల సంఖ్య పెరిగితే సీసీఎంబీ సేవలను వినియోగించుకుంటాం.

---

## ఏపీలో మరో ఇద్దరికి పాజిటివ్

### ఐదుకు చేరిన కరోనా కేసులు

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య ఐదుకు చేరింది. విజయవాడలో ఒకటి, కాకినాడలో మరొకటి తాజాగా నిర్ధారణ అయినట్టు వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఈ రెండు కేసులూ విదేశాల నుంచి వచ్చిన వారే కావడం గమనార్హం. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఓ వ్యక్తి లండన్ నుంచి హైదరాబాద్‌కు.. అక్కడి నుంచి రాజమండ్రికి వచ్చాడు. మరో వ్యక్తి ఫ్రాన్స్ నుంచి ఈ నెల 17వ తేదీన విజయవాడకు వచ్చాడు. వీళ్లిద్దరికీ కరోనా పాజిటివ్ అని నిర్ధారణ అయినట్లు అధికారులు గుర్తించారు. వీరిని బోధనాసుపత్రుల్లోని ఐసోలేషన్ వార్డుల్లో ఉంచి ప్రత్యేక వైద్యం అందిస్తున్నారు. వీరిద్దరూ ఎక్కడెక్కడ తిరిగారు.. ఎవరితో తిరిగారు.. అన్నది ఆరా తీస్తున్నారు. వారి బంధువులను సైతం వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తీసుకువస్తున్నట్టు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకూ నమోదైన కేసులన్నీ విదేశాల నుంచి వచ్చిన వారివే.

# చేతులెత్తి దండం పెడుతున్న..

## విదేశాల నుంచి వచ్చిన వారు రిపోర్టు చేయండి • సీఎం కేసీఆర్ విజ్ఞప్తి

**సాక్షి, హైదరాబాద్:** 'విదేశాల నుంచి వచ్చిన వారికి చేతులెత్తి దండం పెట్టి వేడుకుంటున్న. మీరు మా బిడ్డలే. మా వోళ్లే. మీరు అత్యుత్సాహంతో బయటకు పోయి కుటుంబాన్ని, సమాజాన్ని చెడగొడతారు. దయచేసి మీరు కొంచెం ప్రభుత్వం చెప్పినట్టు వినాలె. సమాజహితం కోరి సహకరించాలె. విదేశాల నుంచి వచ్చామని మీ అంతట మీరు స్వచ్ఛందంగా చెప్పాలి' అని సీఎం కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే... 'ఎక్కడో ఉంటే పట్టుకురావడం ఎందుకు? ఇవాళ ఒకాయన పారిపోతుంటే ఆలేరు కాడ పట్టుకొచ్చిండ్రు. ఇంకొకాయన ఢిల్లీ వెళ్తుంటే కాజీపేట కాడ పట్టుకొచ్చి గాంధీలో పడేసినం. అట్ల చేయకూడదు. నియంత్రణ పాటించాలి. ప్రపంచం ప్రపంచమే.. దేశం దేశమే పరేషానై ఉన్న ఈ సమయంలో ఈమాత్రం స్వీయ నియంత్రణ లేకపోతే కష్టమైతది.

**కుటుంబ సభ్యులైనా రిపోర్టు చేయాలి..**

మీరు స్వచ్ఛందంగా స్థానిక వైద్యులు, పోలీసులు, తహశీల్ కార్యాలయంలో రిపోర్టు చేయండి. మిమ్మల్ని అరెస్టు చేయరు. మీకు ఏమైనా లక్షణాలుంటేనే ఆస్పత్రికి రిఫర్ చేస్తరు. మీకు కొద్దిగా స్టాంప్ వేసి మీ ఇంటి కాడే ఉంచుతరు. ఉదయం, సాయంత్రం మీ పరిస్థితి కనుక్కుంటరు. మిమ్మల్ని ఇబ్బంది పెట్టరు. తద్వారా మీ క్షేమం, మీ కుటుంబ క్షేమం, రాష్ట్ర క్షేమం, దేశ క్షేమం, ప్రపంచ క్షేమం కూడా మానవజాతి క్షేమం దానిలో ఉంటది. విదేశాల నుంచి వచ్చిన వారు స్వయంగా రిపోర్టు చేయకుంటే వారి కుటుంబ సభ్యులు రిపోర్టు చేయాలి. ఇది మీ సామాజిక బాధ్యతగా తీసుకోవాలి. ఎవరో చెప్పాలె.. బలవంతం పెట్టాలని కాకుండా మీ అంతట మీరే ఐసోలేషన్ లో ఉండాలి. జ్వరం, జలుబు, దగ్గు, శ్వాసకోస ఇబ్బందులు వంటి లక్షణాలుంటే తక్షణమే రిపోర్టు చేయాలి. కరోనా వైరస్ వ్యాప్తి నివారణలో మీ సహకారం చాలా అవసరం. ఈ వైరస్ ఇతర దేశాల నుంచి వస్తుంది కాబట్టి... మీరు ఇతర దేశాల నుంచి వస్తున్నారు కాబట్టి రిపోర్టు చేయాలి. మీరు రూ. 10 ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. మీరు కేవలం రిపోర్టు చేస్తే ప్రభుత్వమే అంబులెన్స్ ఏర్పాటు చేస్తది, మందులిస్తది. చికిత్స ఖర్చులన్నీ పెట్టుకుంటది. గ్రామ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు విజ్ఞప్తి. మీ గ్రామాలు/బస్తీల్లో విదేశాల నుంచి వచ్చిన వారుంటే సమాచారం ఇవ్వండి.

**700 అనుమానిత కేసులు...**

మార్చి 1 తర్వాత హైదరాబాద్ ఎయిర్‌పోర్టుతోపాటు ఇతర విమానాశ్రయాల ద్వారా 20 వేల మంది మన రాష్ట్రంలోకి వచ్చిన్రు. ఇప్పటివరకు 11 వేల మందిని గుర్తించి అధీనంలోకి తీసుకున్నం. ఇంకా కొందరిని గుర్తించాల్సి ఉంది. వాళ్లను 14 రోజులు మన నియంత్రణలో పెట్టుకొని వదిలేస్తాం. వాళ్లపై నిఘా కోసం 5,274 నిఘా బృందాలు/పర్యవేక్షక బృందాలు ఏర్పాటు చేసినం. 700 పైచిలుకు కోవిడ్–19 అనుమానితులుంటే వారిని తెచ్చి పరీక్షలు చేస్తున్నం. రాష్ట్రంలో ఇప్పటివరకు 21 మందికి పాజిటివ్ వచ్చింది. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో 52 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి రాష్ట్రంలోకి వచ్చే వాళ్ల ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్నారు. సరిహద్దుల్లో 78 జాయింట్ బృందాలు పనిచేస్తున్నయి'.

### ఐదుగురితో నిపుణుల కమిటీ..

వైద్యారోగ్య శాఖ, సీఎంవో, డీజీపీ కార్యాలయాల నేతృత్వంలో ఐదుగురితో నిపుణుల కమిటీ ఏర్పాటు చేశాం. అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులు, మన దగ్గర ఉత్పన్నమవుతున్న పరిస్థితులు, మనం కరెక్ట్ లైన్ లో ఉన్నమా లేదా? మనం తీసుకున్న చర్యలు సరిపోతున్నాయా లేవా? ఇంకేమైనా చేయాల్సి ఉందా? అని నిరంతరం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు ఈ టీం సూచనలు ఇస్తుంటుంది.

---

# తొలిసారి స్థానిక వ్యక్తికి కోవిడ్

▶ మొదటి పేజీ తరువాయి

లేకపోయినా కూడా వారిని ఇంట్లోనే క్వారంటైన్‌లో ఉండాల్సిందిగా సూచించనున్నారు. అలాగే ఇండోనేసియా నుంచి కరీంనగర్‌కు వచ్చి కోవిడ్ సోకిన వారితో కాంటాక్టు అయిన 35 మందికి కోవిడ్ పరీక్షలు నిర్వహించగా, వారికి నెగెటివ్ వచ్చిందని అధికారులు తెలిపారు. అయితే వారందరినీ కూడా ఛాతీ ఆస్పత్రిలో ఐసోలేషన్‌లో ఉంచారు.

**రెండో దశకు చేరుకున్న కోవిడ్..**


ఇప్పటివరకు వివిధ దేశాల నుంచి వచ్చిన వారికే పాజిటివ్ వచ్చిన సంగతి తెలిసిందే. మొదటి కోవిడ్ పాజిటివ్ వ్యక్తి 86 మందితో కలసినా అతడు తండ్రితో కలసి ఒకే మంచంలో పడుకున్నా ఎవరికీ పాజిటివ్ రాలేదు. ఆ తర్వాత వచ్చిన 13 పాజిటివ్ కేసుల వరకు కూడా వారితో కాంటాక్ట్ అయిన వారికి కూడా కోవిడ్ నమోదు కాలేదు. ఇప్పటివరకు నమోదైన 21 కేసుల్లో 10 మంది ఇండోనేసియన్లకు, ఒక ప్రవాస భారతీయుడికి కోవిడ్ పాజిటివ్ వచ్చింది. మిగిలిన వారంతా కూడా విదేశాల నుంచి మన రాష్ట్రానికి చెందిన వారికి వైరస్ సోకింది. కాగా, రాష్ట్రంలో తొలి కేసు మార్చి 2న నమోదైంది. ఇప్పటివరకు స్థానికులకు ఎవరికీ పాజిటివ్ రాలేదు. కానీ శనివారం విదేశీ చరిత్రలేని స్థానికుడికి వ్యాప్తి చెందడంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. అంటే వైరస్ రాష్ట్రంలోకి ప్రవేశించినట్లుగా భావించినట్లు వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. వాస్తవంగా తొలి కేసులో 86 మందితో కాంటాక్టు అయినా ఒక్కరికీ రాలేదు. స్కాట్లాండ్ నుంచి వచ్చిన మూడో బాధితుడితో 69 మంది కాంటాక్ట్ అయ్యారు. వారిలోనూ ఏ ఒక్కరికీ పాజిటివ్ రాలేదు. కోవిడ్ సోకిన 10 మంది ఇండోనేసియన్లతో కలసి ఉన్న స్థానికులెవరికీ రాలేదు. దీంతో మన దగ్గర ఉన్న వాతావరణ పరిస్థితులకు కోవిడ్ రెండో దశకు రాదన్న ధీమా కనిపించింది. కానీ శనివారం స్థానిక వ్యక్తికి వైరస్ రావడంతో పరిస్థితి తారుమారైంది. స్థానికంగా వైరస్ మరింత విస్తరించకుండా ఆపగలిగితేనే ఉపద్రవం నుంచి బయట పడగలుగుతాం. లేకపోతే పరిస్థితి చేయిదాటిపోతుందని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం రెండో దశకు చేరిన వైరస్‌ను ఆపగలగడమే ప్రభుత్వం ముందున్న సవాల్.

**సీఎం కఠిన నిర్ణయాలు..**

కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో సీఎం కేసీఆర్ కఠినమైన నిర్ణయాలు తీసుకున్నారు. పరిస్థితి చేజారకుండా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అవసరమైతే అన్నీ షట్‌డౌన్ చేస్తామని పేర్కొనడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. రాష్ట్ర సరిహద్దులను మూయడంతో పాటు అత్యవసర సర్వీసులు మినహా అన్నింటినీ బంద్ పెట్టడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు అర్థమవుతోంది. విదేశాల నుంచి వచ్చిన దాదాపు 9 వేల మందిని గుర్తించి వారి ఆరోగ్యపరిస్థితిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నట్లు శనివారం జరిగిన సమీక్షలో సీఎస్ తెలిపారు. వారందరూ ఇళ్ల నుంచి బయటకు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

**బార్కాస్‌లో కలకలం..**

సౌదీ నుంచి వచ్చిన యువకుడికి కరోనా లక్షణాలున్నాయన్న విషయం చాంద్రాయణగుట్ట బార్కాస్‌లో కలకలం రేపింది. బార్కాస్‌కు చెందిన 25 ఏళ్ల యువకుడు ఫిబ్రవరి 9న సౌదీ నుంచి వచ్చాడు. 15 రోజుల నుంచి దగ్గు, జ్వరంతో బాధ పడుతుండగా, గమనించిన స్థానికులు తొలుత స్థానిక ఆస్పత్రికి ఆపై గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నెగెటివ్ అని తేలింది.



epaper.sakshi.com

**గ్రామర్...** కష్టమైన సబ్జెక్ట్. అర్థం అయితే చాలా ఈజీ.
ప్రెజెంట్‌లో ఉన్నా ఫ్యూచర్ కూడా అర్థమవుతుంది.
**పెళ్లి...** ఇదో సెపరేట్ గ్రామర్.
భర్తది ఒక గ్రామర్... భార్యది ఒక గ్రామర్.
ఒకరి గ్రామర్ మరొకరికి అర్థమైతే ఫ్యూచర్ అర్థవంతంగా ఉంటుంది.
అర్జున్ గ్రామర్ నివేదితకి అర్థమైంది.. నివేదిత గ్రామర్ అర్జున్‌కి అర్థమైంది.
ఒకరినొకరు అర్థం చేసుకోలేకపోతే వివాహ బంధానికి అర్థమే లేదంటున్నారు ఇద్దరూ.

## • నివేదితార్జునీయం

# సూపర్ గ్రామర్



● నివేదిత, అర్జున్

**● మీ పెళ్లయి 32 ఏళ్లయింది. వెనక్కి తిరిగి చూసుకుంటే ఇన్నేళ్ల జీవితం ఎలా అనిపిస్తోంది?**

**అర్జున్:** మా ఫ్రెండ్స్ '25 ఏళ్లకే పెళ్లి చేసుకున్నావేంటి? కొన్నాళ్లు బ్యాచిలర్ లైఫ్‌ని ఎంజాయ్ చేసి ఉండొచ్చు' అనేవాళ్లు. అయితే వెనక్కి తిరిగి చూసుకుంటే 'తొందరగా పెళ్లి చేసుకుని ఎంత మంచి పని చేశానా' అనిపిస్తోంది. సరైన టైమ్‌లో సరైన నిర్ణయం తీసుకున్నాను అనుకుంటున్నాను. ఒంటరిగా ఉండి సాధించవచ్చు అనుకుంటారు. కానీ కలసి సాధించడంలో కిక్ వేరే ఉంటుంది. పెళ్లి చేసుకున్నవాళ్లకే అది తెలుస్తుంది. నా లైఫ్‌లో జరిగిన బెస్ట్ విషయాల్లో నివేదితతో పెళ్లి ఒకటి.

**నివేదిత:** నా లైఫ్‌లో జరిగిన మంచి విషయం అర్జున్‌గారిని పెళ్లి చేసుకోవడమే. ఆయనతో 32 ఏళ్ల లైఫ్ చాలా చాలా బాగుంది.

**అర్జున్:** మా ఇద్దరమ్మాయిలు (ఐశ్వర్య, అంజనా) 'నాన్నా.. మాకు ఫ్రెండ్‌లా కనిపిస్తున్నారు' అంటారు. అందుకే త్వరగా పెళ్లి చేసుకున్నందుకు హ్యాపీ.

**నివేదిత:** నన్ను కూడా ఫ్రెండ్ అనే అంటారు.

**● మీది లవ్ మ్యారేజ్ అని విన్నాం... ఆ లవ్‌స్టోరీ గురించి చెబుతారా?**

**అర్జున్:** తను కన్నడ నటి. 'రూపతార' అనే కన్నడ సినిమా మ్యాగజీన్‌లో తన ఫొటో చూశాను. 'ఈ అమ్మాయి బావుంది' అనుకున్నాను. అప్పుడు 'డాక్టర్‌గారి అబ్బాయి' అని తెలుగు సినిమా కమిట్ అయ్యాను. పీయస్ రామచంద్రరావుగారు డైరెక్టర్. ఆ సినిమాకి నివేదితను రికమండ్ చేశాను. వెంటనే ఓకే అన్నారు. నివేదిత నాన్నగారు (రాజేష్) కన్నడంలో పెద్ద స్టార్. అదే టైమ్‌లో మా నాన్నగారు (శక్తి ప్రసాద్) విలన్. వాళ్ల నాన్నగారు, మా నాన్నగారు క్లోజ్ ఫ్రెండ్స్. మా నాన్నగారు 86లోనే చనిపోయారు. ఇక 'డాక్టర్‌గారి అబ్బాయి' సినిమా చేస్తుండగా నివేదితకు, నాకు మధ్య సాన్నిహిత్యం పెరిగింది. ఆ సినిమా క్లైమాక్స్‌లో నాకు, కోట శ్రీనివాసరావుగారికి మధ్య వెటర్నరీలో వాడే పెద్ద సిరంజీలతో ఫైట్ ఉంటుంది. టైమింగ్ మిస్ అయి, ఆ సిరంజి నా చేతికి గుచ్చుకుని చేయి మొత్తం చీలిపోయింది. దగ్గర్లో ఉన్న హాస్పిటల్‌కి వెళ్లాం. కుట్లు వేశారు. పక్కనే ఈ అమ్మాయి ఉంది. కళ్ల నిండా నీళ్లు. ఆ రోజే నాకు ఫీలింగ్ స్టార్టయింది.

**● ఫస్ట్ ఎవరు ప్రపోజ్ చేశారు?**

**అర్జున్:** 'నన్ను పెళ్లి చేసుకుంటావా' అని ఆ సినిమా సెట్లో అడిగా. ఓకే అంది.

**● పెళ్లప్పుడు మీకు 25 ఏళ్లు. మరి ఆమెకి?**

**అర్జున్:** తనకి 17. అదేం మాకు సమస్య కాదు కానీ ఎక్కడ మిస్ కొట్టిందంటే.. ఆ వయసులో తనకు మెచ్యూరిటీ కొంచెం తక్కువ ఉండేది. నా సినిమాల ప్రివ్యూలను ఇద్దరం కలిసి చూసేవాళ్లం. ఒక సినిమా చూస్తున్నప్పుడు ఎవరో ఏడుస్తున్నట్లు వినిపించింది. ఏడుస్తున్నది తనే. 'ఎందుకు ఏడుస్తున్నావు' అని అడిగితే చెప్పలేదు. ఇంటికి వచ్చాక చెప్పింది. సినిమాలో నేను హీరోయిన్‌తో చాలా క్లోజ్‌గా మూవ్ అవడం తను తట్టుకోలేకపోయింది. 'నువ్వు కూడా యాక్టరే కదా.. ఇదంతా ప్రొఫెషన్‌లో భాగమే' అన్నాను. వెంటనే కన్విన్స్ కాలేదు. మెల్లిగా అర్థం చేసుకుంది.

**నివేదిత:** 17 ఏళ్ల వయసు అమ్మాయిలు అలానే ఉంటారేమో. మాది సినిమా బ్యాగ్రౌండ్ అయినా భర్త వేరే స్త్రీతో నటన కోసం అయినా సరే క్లోజ్‌గా ఉండటాన్ని భరించలేకపోయాను (నవ్వుతూ).

**అర్జున్:** మరో ముఖ్య విషయం ఏంటంటే.. ఎంత బిజీగా ఉన్నా మన కుటుంబానికి, భార్యకు టైమ్ ఇవ్వాలి. 'ఇంత ఇమ్మెచ్యూర్డ్‌గా ఆలోచిస్తుందేంటి' అని కోపం తెచ్చుకోకుండా అర్థమయ్యేలా చెప్పా. అర్థం చేసుకోవడానికి టైమ్ తీసుకుంది. తర్వాత సెట్టయింది. ఆ 17 ఏళ్ల అమ్మాయి ఇప్పుడు నేను ఎలా ఉండాలో చెబుతుంది (నవ్వుతూ). కోపం తెచ్చుకో వద్దు అని పాజిటివ్‌నెస్ తీసుకొస్తుంది. ఈ ఇంటర్వ్యూలో చెప్పాలనుకున్న ముఖ్యమైన విషయం ఏంటంటే... మీ ఫ్యామిలీకి టైమ్ ఇవ్వండి. నేను ఇచ్చాను కాబట్టే ఈరోజు నేను చాలా హ్యాపీ పర్సన్.

**నివేదిత:** నా పెళ్లి సమయానికి చిన్న పిల్లని కాబట్టి కొన్ని విషయాలు అర్థం అయ్యేవి కావు. మొదట్లో కొంచెం కష్టంగా ఉండేది. ఆ తర్వాత అర్థం చేసుకున్నాను.

**● ఈ 32 ఏళ్లలో మీ ఇద్దరిలో వచ్చిన మార్పేంటి?**

**నివేదిత:** చాలా మార్పులు వచ్చాయి. గొడవలు పడ్డాం. సర్దుకుపోయాం. ఇన్నేళ్లల్లో మా గొడవల్ని మేం ఎప్పుడూ మరుసటి రోజు వరకూ కొనసాగించలేదు. ఏదైనా ఆ రోజు వరకే. మా 'మంత్ర' ఒకటే.. ఏ గొడవ జరిగినా 'ఫర్గెట్ అండ్ ఫర్గివ్'.

**● ఇంటి పనుల్లో మీవారు హెల్ప్ చేస్తారా?**

**నివేదిత:** చేస్తారు. ఎవ్వరూ లేకపోతే గిన్నెలు క్లీన్ చేయడంలో కూడా సహాయం చేస్తుంటారు. ఇల్లు శుభ్రంగా ఉంచడం ఆయనకు ఇష్టం. ఇద్దరమ్మాయిల రూమ్స్‌ని నీట్‌గా సర్ది పెడుతుంటారు.

**● వంట చేయడం వచ్చా?**

**అర్జున్:** కాఫీ పెడతాను. ఆమ్లెట్ వేసుకోగలుగుతాను. పులిహోర బాగానే చేయగలుగుతాను.

**నివేదిత:** పులిహోర తన ఫేవరెట్. వంటమనిషి రాకపోతే వంట ప్రయత్నిస్తారు. ఆయన పెట్టే కాఫీ నాకు చాలా ఇష్టం.

**● అర్జున్‌గారు నటించిన చిత్రాల్లో 'జెంటిల్‌మేన్' ఒకటి. రియల్ లైఫ్‌లో ఆయన..?**

**నివేదిత:** నిజజీవితంలో వెరీ వెరీ జెంటిల్‌మేన్. మా పెళ్లైన కొత్తలో నా అభిప్రాయాలను ఎంత గౌరవించారో ఇప్పుడూ అంతే గౌరవిస్తున్నారు. స్వేచ్ఛ ఇస్తారు. నాకు కావల్సినవి వెంటనే సమకూరాయో లేదో చూసుకుంటారు. భర్తల్లో తక్కువమందికి ఈ క్వాలిటీ ఉంటుంది. స్త్రీల క్షేమం కోసం తన పరిధి దాటి సహాయం చేయడానికి వెనకాడరు.

**● మరి మీ ఆవిడ గురించి?**

**అర్జున్:** షీ ఈజ్ బెస్ట్. బ్యూటిఫుల్, డ్యూటిఫుల్, రెస్పాన్సిబుల్ పర్సన్. నా జీవితంలో నేను కలిసిన ఏకైక నిజాయితీ గల వ్యక్తి.

**● మీ భార్యలో మీకు నచ్చిన విషయాలు?**

**అర్జున్:** ఒక్కొక్కరిదీ ఒక్కోలాంటి మనస్తత్వం, వ్యక్తిత్వం. నా భార్యలో నేను చూసింది పాజిటివిటీ. అబద్ధం చెప్పదు. నాకు ఇప్పుడు ఇద్దరు అమ్మలున్నారు. ఒకరు నా తల్లి, రెండోది నా భార్య.

**● అర్జున్‌గారిలో మీకు నచ్చేవి?**

**నివేదిత:** కుటుంబాన్ని బాగా ప్రేమిస్తారు. చాలా సపోర్టివ్‌గా ఉంటారు. ఆయనలాంటి భర్త దొరకడం నా అదృష్టం.

**● మీ అమ్మాయి ఐశ్వర్యను హీరోయిన్‌ని చేయడానికి కారణం?**

**అర్జున్:** 35ఏళ్లుగా ఫిల్మ్ ఇండస్ట్రీలో ఉన్నాను. ఇంతకన్నా మంచి ఇండస్ట్రీ నాకు తెలిసి లేదు. బయట నుంచి చూసేవాళ్లు చెడు ఉదాహరణలు చెబుతుంటారు. మంచీ చెడు ఎక్కడైనా ఉంటాయి. నా ఇండస్ట్రీ అంటే నాకు గౌరవం. మా అమ్మాయిని కూడా పరిచయం చేయడం గర్వంగా ఉంది. తనకూ యాక్టింగ్ అంటే ఇంట్రెస్ట్. మా ఐశ్వర్యను కన్నడం, తమిళంలో హీరోయిన్‌గా పరిచయం చేశాను. తెలుగులో పరిచయం చేయాలనుకుంటున్నాను. 1984 నుంచి తెలుగు ప్రేక్షకులు నన్ను ఆదరిస్తున్నారు. తెలుగు పరిశ్రమలో మా అమ్మాయి కూడా యాక్ట్ చేయాలనుకుంటున్నాను. రెండో అమ్మాయి అమెరికాలో గ్రాడ్యుయేషన్ చేసింది. వాళ్ల కెరీర్ కోసం కష్టపడుతున్నారు. వాళ్ల నాన్నగా అండగా నిలబడతాను. నాన్నలందరికీ నా విన్నపం ఏంటంటే మీ పిల్లల కోసం మీరు ఆరోగ్యంగా ఉండండి. మరీ ముఖ్యంగా ఆడపిల్లల ఉన్నవాళ్లు. ఆడపిల్లలకు తండ్రి సంరక్షణ కావాలి.

**● వర్కింగ్ ఉమెన్ మీద మీ అభిప్రాయం?**

**అర్జున్:** 'ఉమెన్‌హుడ్'ని నేను చాలా గౌరవిస్తాను. అమ్మ అయినా భార్య అయినా అక్క అయినా, చెల్లయినా.. వర్కింగ్ ఉమెన్ అంటే చాలా గౌరవం. మా ఇంట్లో పని చేసేవాళ్లను 'ఎన్ని గంటలకు నిద్ర లేస్తారు. మీ ఇంట్లో వంట చేసి మా ఇంటికి వస్తారా?' అని అడుగుతాను. వాళ్లు చెప్పింది వింటుంటే ఆశ్చర్యంగా అనిపిస్తుంటుంది. వాళ్ల కష్టం ముందు మాది పెద్ద కష్టం కాదనిపిస్తుంది. ఇంట్లో పనిచేసి, బయట పనిచేసి ఫ్యామిలీని పెంచి పెద్ద చేయడం చిన్న విషయం కాదు. వాళ్లందరికీ నా సెల్యూట్.

**● మీ ఇద్దరిలో ఎవరు డామినేటింగ్?**

**అర్జున్:** నా భార్యని అడిగితే నేనే డామినేటింగ్ అంటుందేమో. ఎవరి దృష్టిలో వాళ్లు కరెక్ట్ అనుకుంటాం. నా మనసుకి ఏది అనిపిస్తే అది చెబుతాను. ఉన్నదే చెబుతున్నాం అని మనం అనుకుంటాం. కానీ చెప్పింది వినాలన్నప్పుడు 'తను డామినేటింగ్' అనుకోవచ్చు. డామినేటింగ్‌కి కరెక్ట్ గ్రామర్ తెలియదు నాకు. అయితే చాలాసార్లు తను చెప్పింది వింటాను. కానీ చెప్పే విషయంలో చిన్న లాజిక్ ఉండాలనుకుంటాను. అది లేకపోతే మా అమ్మ చెప్పినా నా భార్య చెప్పినా వినను. నాక్కూడా కరెక్ట్ అనిపించాలి.

**నివేదిత:** విన్నారు కదా.. లాజికల్‌గా చెప్పాలంటారు. మేం కూడా చెప్పడానికి ట్రై చేస్తాం (నవ్వుతూ). అయితే కొన్నిసార్లు కొన్ని ఇష్యూల్లో నేనే స్టాండ్ తీసుకుంటాను.

**● మ్యారీడ్ లైఫ్ గురించి మీరు చెప్పిన విషయాలు బాగున్నాయి. మరి.. వైవాహిక జీవితం ఇలా ఉంటే బాగుంటుంది? అని చెబుతూ ఏదైనా సినిమా తీయాలనుకుంటున్నారా?**

**అర్జున్:** మా అమ్మాయితో నేను తీయబోతున్న సినిమాలో చాలా టిప్స్ చెప్పబోతున్నాను. జనరల్‌గా చెప్పాలంటే ఒకరిని ఒకరు అర్థం చేసుకోవడమే. ఎక్కడో పుట్టి ఎక్కడో చదువుకొని ఒకటవుతాం. మనస్తత్వాలు వేరయినా ఒకే ఇంట్లో ఉంటాం. విభేదాలు వస్తాయి. కొంచెం ఓపిక పడదాం, అడ్జస్ట్ అవుదాం అని అనుకోగలిగితే అంతా సవ్యంగా ఉంటుంది. నువ్వు ఎలా ఉన్నా అంగీకరిస్తాను అని ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. ఈగో, పొసెసివ్‌నెస్ ఉంటాయి. అప్పుడు మనల్ని అపరిమితంగా ప్రేమిస్తున్నారు అని అర్థం చేసుకోవాలి. నేను హీరోయిన్‌తో క్లోజ్‌గా ఉండేది నటనే అయినా తను భరించలేకపోయింది. అది నా మీద తనకున్న ప్రేమ అని అర్థం చేసుకున్నాను.

**నివేదిత:** ఒకరికి ఒకరు స్పేస్ ఇవ్వాలి. ఒకరినొకరు గౌరవించుకోవాలి. నమ్మకం, అర్థం చేసుకోవడం అనేది చాలా ముఖ్యం. ఈగో అనేది దాంపత్యంలో అస్సలు వర్కౌట్ అవ్వదు. నా వరకూ నేను చాలా కంఫర్ట్‌బుల్‌గా ఉన్నాను. ఈ ఇంట్లో ఉండటం అదృష్టంగా భావిస్తున్నాను.

**అర్జున్:** పెళ్లయ్యాక తన కుటుంబం, నా కుటుంబం అని ఉండకూడదు. మాకు ఆ భేదం లేదు. మా అమ్మగారు వాళ్ల అమ్మగారు ఇద్దరూ నాకు సమానమే. తనకూ అంతే. అత్తింటిని పుట్టిల్లు అని అమ్మాయి అనుకోవాలి. అబ్బాయి కూడా అలానే అనుకోవాలి. మేం అలానే అనుకున్నాం.

**నివేదిత:** అది చాలా ఇంపార్టెంట్. అసలు భార్యాభర్తల మధ్య గొడవలకు ఓ కారణం భర్త ఇంటివాళ్లను భార్య తనవాళ్లు అనుకోకపోవడం, భార్య కుటుంబాన్ని తన కుటుంబంలా భర్త అనుకోకపోవడమే. మా ఇద్దరికీ ఆ ప్రాబ్లమ్ లేదు. మాకు అందరూ సమానమే.

– డి.జి. భవాని

### ట్రిప్స్‌కి వెళ్తుంటారా?

**నివేదిత:** చాలా ట్రిప్స్‌కి వెళ్లాం. తన షూటింగ్స్‌కి బ్రేక్ ఉన్నా, పిల్లలకి సెలవులొచ్చినా ట్రిప్స్ ప్లాన్ చేసుకుంటాం. ఆయన ఫారిన్‌లో షూటింగ్ చేసినప్పుడల్లా ఆయనతో కలిసి వెళ్లాం. ఈ మధ్య వెళ్లిన హాలిడే అంటే.. మాల్దీవ్స్. ఇప్పుడైతే ట్రావెల్ చేసే ఆలోచన లేదు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పరిస్థితి బాలేదు. కొన్ని రూల్స్ ఉన్నాయి. అందరూ వాటిని ఫాలో అవ్వాలి. పరిస్థితులన్నీ కుదుటపడే వరకూ జాగ్రత్తగా ఉందాం.

**అర్జున్:** అవును.. వీలైనంతవరకూ ఇంట్లోనే ఉందాం. సమాజం మేలు కోసం మనవంతు సహాయం చేయాలి.

**● ప్రస్తుతం ఎక్కడ చూసినా ఆడపిల్లలపై దాడులు జరుగుతున్నాయి. ఇద్దరు ఆడపిల్లల తల్లిదండ్రులుగా భయంగా ఉంటుందా?**



● కుమార్తెలు అంజనా, ఐశ్వర్యలతో అర్జున్, నివేదిత

**అర్జున్:** అందరి తల్లిదండ్రులకు ఉన్నట్టే నాకూ భయం ఉంటుంది. మంచీ చెడూ అన్ని చోట్లా ఉన్నాయి. ఆడపిల్లలకు ప్రతిదీ చెబుతూ పెంచాలి. సెక్స్ అంటే వివరంగా చెప్పాలి. అందులో మంచి చెడ్డలు వివరించాలి. అప్పుడు అదేంటో తెలుసుకోవాలనే కంగారు ఉండదు. జాగ్రత్తగా ఉండటానికి ఉపయోగపడుతుంది. తల్లిదండ్రులకు ఇది కూడా ఓ బాధ్యతే. ప్రస్తుతం ఈ పాయింట్‌తోనే ఓ సినిమా చేస్తున్నాను. ఆడపిల్లలు ఆత్మరక్షణ నేర్చుకోవాలి. కరాటే నేర్చుకోవాలి. పెప్పర్ స్ప్రే ఎప్పుడూ దగ్గర పెట్టుకోవాలి. మనల్ని కాపాడటానికి ఎవరో వస్తారు అనుకోవడం కరెక్ట్ కాదు.

**నివేదిత:** తల్లిదండ్రులు ఫ్రెండ్స్‌లా ఉన్నప్పుడే వాళ్లతో ఏదైనా మాట్లాడగలం. పేరెంట్స్‌కి పిల్లలు భయపడాలని కాదు. గౌరవం ఉండాలి. భయం కన్నా గౌరవం ఉన్నచోట తప్పులు చేయరని నా ఫీలింగ్. అందుకే మా పిల్లల్ని భయపెట్టం. స్నేహితుల్లా ఉంటాం. పిరికిగా ఉండకూడదని చెబుతుంటాం.

**బ్యూటిప్స్**

## వెంట్రుకల నిగారింపు తగ్గకూడదంటే...

- అలొవెరా రసం, అవకాడో నూనె, ఆముదం... వంటి వాటితో మసాజ్ చేసుకొని తల స్నానం చేస్తే వెంట్రుకలు పొడిబారే సమస్య దరిచేరదు.
- ఎండవేళలో బయటకు వెళ్లేటప్పుడు తలకు స్కార్ఫ్ లేదా క్యాప్ వంటివి తప్పనిసరిగా ఉపయోగించాలి. లేదంటే నేరుగా సూర్యకాంతి పడి అతినీలలోహిత కిరణాల వల్ల మాడుపై సహజమైన నూనెలు తగ్గిపోయే అవకాశం ఉంది. దీనివల్ల వెంట్రుకలు పొడిబారి నిస్తేజంగా మారడం, రాలిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి.
- ఉక్కపోతకు తరచూ తల తడపడం వల్ల మాడుపై ఉండే సహజ నూనె గ్రంథులు అదనపు నూనెను స్రవిస్తాయి. దీనివల్ల జుట్టు మరీ జిడ్డుగా మారుతుంది. రసాయనాల గాఢత తక్కువ ఉన్న షాంపూ వాడకం మేలు.
- జుట్టును ఆరబెట్టుకోవడానికి ఈ కాలం డ్రయ్యర్‌ని ఉపయోగించకపోవడమే మేలు. స్ట్రెయిటెనర్‌తో ఐరన్ చేయడం, రింగులుగా మార్చడం వంటి హెయిర్ స్టైల్స్ శిరోజాలను పొడిబారేలా చేస్తాయి. దీనివల్ల జుట్టు కండిషనింగ్ దెబ్బతిని త్వరగా రాలిపోతుంది.



**కరోనా కథలు - 5**

## తినడం కంటే కొనడం ఎక్కువైంది

కరోనా భయం ప్రపంచాన్ని వణికిస్తోంది. యూఎస్‌లో ప్రభుత్వం హెల్త్ ఎమర్జెన్సీ విధించింది. అయితే హరికేన్‌ల వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ఆహారపదార్థాలను ఎక్కువ మొత్తంలో కొని ఇళ్లలో స్టాక్ పెట్టుకోవడం అక్కడి వాళ్లకు అలవాటు. ఇప్పుడు కూడా పప్పుధాన్యాలు, వాటర్ క్యాన్‌లు, ఫ్రోజెన్ ఫుడ్ విపరీతంగా కొంటున్నారు. హ్యూస్టన్‌లోని ఒక వాల్‌మార్ట్‌లో అయితే గడచిన ఆదివారం బియ్యం దొరకలేదు. బంగాళదుంపలు, పెరుగుకు కొరత వచ్చేసింది. నూడుల్స్ ర్యాక్‌లు ఖాళీగా ఉంటున్నాయి.



అమెరికా లైఫ్‌స్టైల్‌లో ఆఫీస్ క్యాంటీన్‌లో, రెస్టారెంట్‌లో తింటూ ఇంట్లో రోజుకు ఒకసారి మాత్రమే తింటుంటారు. ఇప్పుడు వర్క్ ఫ్రమ్ హోమ్, స్కూళ్లకు సెలవులు ప్రకటించడంతో రోజంతా ఇంట్లోనే తినాలి కాబట్టి ఫుడ్ స్టాక్ మీద ఎక్కువ ఫోకస్ ఉంటోంది. మనుషులు అవసరం అయితే తప్ప బయటకు రావడం లేదు. గత వారం వరకు గలేరియా మాల్‌లో కూడా చాలా స్టోర్‌లు మూసేశారు. రెండు రోజుల నుంచి గలేరియా మాల్‌ని పూర్తిగా క్లోజ్ చేశారు. రెస్టారెంట్‌లు, బార్‌లు కూడా మూసేయడంతో... అక్కడి వాళ్లు బీర్, ఆల్కహాల్ వంటి డ్రింకులను కూడా కేసుల కొద్దీ కొని ఇంట్లో పెట్టుకుంటున్నారు. మరీ దారుణం ఏమిటంటే... కొంతమంది టిష్యూలు, శానిటైజర్‌లు, నీళ్ల క్యాన్‌లు, ఎగ్స్‌ని పెద్ద మొత్తంలో కొనేసి అవసరమైన వాళ్లకు ఎక్కువ ధరలకు అమ్ముతున్నారు. ఈ పని చేస్తున్నది వ్యాపారులు కాదు, మామూలు వాళ్లే.

ఆఫీసుల్లో అయితే అడుగడుగునా శానిటైజర్‌లు కనిపిస్తున్నాయి. రిసెప్షన్, లిఫ్ట్‌తో పాటు ఉద్యోగుల డెస్క్ దగ్గర కూడా ఉంటున్నాయి. కీ బోర్డు, మౌస్‌లను కూడా పని చేసే ముందు శానిటైజర్‌తో తుడుస్తున్నారు. పని చేసేటప్పుడు మధ్యలో మరేదైనా వస్తువును ముట్టుకున్నా సరే... వెంటనే శానిటైజర్‌తో చేతులను శుభ్రం చేసుకుంటున్నారు. పలకరింపులు కూడా 'హలో. హాయ్'లే. షేక్ హ్యాండ్స్ లేవు.



సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
సినిమా
ఆదివారం 22-3-2020




కరోనా టైమ్స్







● 'మాయాబజార్' చిత్రంలో దృశ్యం










# స్ట్రెస్ వద్దు... సినిమా చూడండి

**కరోనా వార్తలు బెంబేలెత్తించవచ్చు. జనతా కర్ఫ్యూ మనం ఇంట్లోనే ఉండవలసిన బాధ్యతను గుర్తు చేయవచ్చు. ఇదీ ఒకందుకు మంచిదే. ఉరుకుల పరుగుల జీవితం నుంచి కొంచెం బ్రేక్ దొరికినట్టవుతుంది. ఇలాంటి టైములో స్ట్రెస్‌ను పక్కన పెట్టండి. హాయిగా కుటుంబంతో కామెడీ సినిమాలు చూడండి. కామెడీ సీన్లు ప్లే చేసి హాయిగా నవ్వుకోండి. 'కరోనా'కు రోగ నిరోధక శక్తిని చూస్తే భయం. హాస్యం అత్యంత పెద్ద రోగ నిరోధక శక్తి. గొప్ప హెల్త్ టానిక్.**

'మీకు పాండిత్యం ఉంది కాని బుద్ధి లేదోయ్' అంటాడు శకుని 'మాయాబజార్'లో శర్మ, శాస్త్రిలను ఉద్దేశించి. వారు చేసిన బుద్ధిమాలిన పని ఏమిటి? యాదవుల విడిదికి వచ్చి, మగపెళ్లివారమన్న సంగతిని మరచి, సాక్షాత్తు సుయోధనుని ముందే ఆడపెళ్లివాళ్లను పొగడటం... వాళ్ల ఏర్పాట్లను చూసి నోరు వెళ్లబెట్టడం. పండితులంటే గొప్పవారని మన ఉద్దేశం. కాని పాండిత్యం వేరు, బుద్ధి వేరు అని ఈ సినిమాలో నవ్వు వచ్చేలా నీతి చెబుతాడు దర్శకుడు కె.వి.రెడ్డి. కొంచెం స్ట్రెస్ వదిలించుకోవడానికి ఆ సినిమాయో సీనో చూసేయండి. బాగుంటుంది.

'జస్టిస్... జస్టిస్... ఐ వాంట్ సింపుల్ జస్టిస్' అంటుంటాడు రమణారెడ్డి 'మిస్సమ్మ' సినిమాలో. సావిత్రి మీద కన్నేసిన ఈ మాయల మరాఠి ఆమెను ఎలాగైనా సొంతం చేసుకోవాలని ఇచ్చిన అప్పును అడ్డం పెట్టి బ్లాక్‌మెయిల్ చేస్తుంటాడు. అతడో పెద్ద ఫోర్ట్వంటి. కానీ నోరు తెరిస్తే 'జస్టిస్' అని న్యాయం మాట్లాడుతుంటాడు. లోకంలో నిండా ఉన్నది ఇలాంటి మనుషులే అని రచయిత చక్రపాణి, దర్శకుడు ఎల్.వి.ప్రసాద్ నవ్విస్తూ చూపుతారు 'మిస్సమ్మ'లో. చూడండి బాగుంటుంది.

'బ్రేకులా... మనం ఈ కారు కొన్నప్పటి నుంచి వాటి కోసమే వెతుకుతున్నాం... దొరకలేదు' అంటాడు అక్కినేని సరాసరి తన డొక్కు కారుతో కాంచన, రాజశ్రీల కారును డాష్ కొట్టి. 'ప్రేమించి చూడు'లో రెండు జంటలు, నాలుగు నవ్వులు ఉంటాయి. 'నీ అందాల చేతులు కందేను పాపం ఎందుకు ఈ బెడద... సాయము వలదా' వంటి రసగుల్లాలు, 'అందాలు తొంగి చూసే హా..హా..హా..' వంటి పాల తాలికలు ఉంటాయి. ఈ సినిమాలోనే సినిమా పిచ్చోడు చలం వాళ్ల నాన్న రేలంగికి వల్లకాడు కథ చెప్పి భయపెడుతుంటాడు. రావికొండల రావు 'తెలుగు మాష్టారు' హాస్యం ఉంటుంది. సరదా సినిమా. ఇది ఖాళీ సమయం. చూసేయండి.

భానుమతిని చాలా సినిమాల్లో ఇష్టంగా చూడొచ్చుగాని 'మట్టిలో మాణిక్యం'లో ఇంకా ఇష్టంగా చూడొచ్చు. ఆమె వ్యంగ్యం అంతా ఆ సినిమాలో ఉంటుంది. మరిది చలంను కన్నబిడ్డలాగా కాపాడుకోవడంలో ఆమె చూపించే ఆరిందాతనం ఎంతో ఆహ్లాదం కలిగిస్తుంది. ఎంతో అమాయకంగా ఉండే చలం నటన, అతని స్నేహితుడిగా పద్మనాభం హాస్యం సినిమాను పరుగులెత్తిస్తాయి. జమున ఒక జాంపండులా ఉంటుంది. 'నా మాటే నీ మాటై చదవాలి' అని పాట కూడా పాడుతుంది. ఇంట్లోనే ఉండి హైదరాబాద్ చుట్టేయాలంటే ఈ సినిమా చూడొచ్చు. 'రిమ్ జిమ్ రిమ్‌జిమ్ హైదరాబాద్ రిక్షావాలా జిందాబాద్' పాడేయొచ్చు.

రేడియో ప్రోగ్రామ్ వింటూ వంకాయ కూర చేద్దామనుకుంటాడు సీతాపతి. కానీ పక్క స్టేషన్‌లో యోగా క్లాస్ కూడా వస్తుంటుంది. రెండు స్టేషన్‌లూ జామ్ అవుతుంటాయి. దాంతో యోగా చేస్తూ వంకాయ కూర చేస్తూ నవ్విస్తాడు మనల్ని. 'సీతాపతి సంసారం' సినిమా మధ్యతరగతి గుమాస్తా బతుకులో భర్త మీద భార్యకు, భార్య మీద భర్తకు ఉన్న కంప్లయింట్‌లను లైటర్ వెయిన్‌లో చూపిస్తుంది. సంసారం పెద్ద కష్టం కాదు అని భార్య రోల్‌లోకి వచ్చిన సీతాపతి చాలా కామెడీ చేస్తాడు. చంద్రమోహన్, ప్రభ నటించిన ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చింది. ఇప్పుడు ఇంట్లో భార్య, భర్త తీరుబడిగా ఉండే సమయం. చాలా కంప్లయింట్‌లు చేసుకునే మూడ్ కూడా వస్తుంది. ఆ మూడ్ వద్దు. అడ్జస్ట్ అవుతూ బతకడమే ముద్దు అని 'సీతాపతి సంసారం' చూసేయండి.

అతనికి ఆరుగురు పిల్లలు. ఆమెకు అరడజను సంతానం. ఈ ఇద్దరూ పెళ్లి చేసుకోవాలి. అతని పిల్లలు రౌడీ మూక. ఆమె పిల్లలు కిష్కింధ ఇలాక. ఈ పన్నెండు మంది కలిస్తే ఆ పెళ్లి ఎంత అల్లరి గిల్లరిగా, ఆ కాపురం ఎంత నవ్వులుపువ్వులుగా ఉంటుందో చెప్పలేం. 'రామదండు' సినిమా ఇది. మురళీమోహన్, సరిత నటించారు. కె.బాలచందర్ దర్శకత్వ పర్యవేక్షణ వహించారు. 'బండి కాదు మొండి ఇది సాయం పట్టండి' పాట ఇందులోదే. ఇంట్లో పిల్లలు ఇప్పుడేం చేయాలో తెలియక కోతి పనులు చేస్తుంటారు. వారికి ఈ కోతి సినిమా చూపించండి. బుద్ధిగుంటారు. భలే నవ్వుకుంటారు.

ఇక జంధ్యాల, రేలంగి నరసింహారావు, వంశీ, ఇ.వి.వి. సత్యనారాయణ, పి.ఎన్.రామచంద్రరావు, శివ నాగేశ్వరరావు, భీమనేని శ్రీనివాసరావు, విజయ భాస్కర్... వీరంతా తీసిన సినిమాలు తెలుగులో ఎన్నో స్ట్రెస్ బస్టర్స్‌గా ఉన్నాయి. ఎన్నో పాత్రలు నవ్వించి మనల్ని కాసేపు టెన్షన్స్ మర్చిపోయేలా చేస్తాయి. 'శ్రీవారికి ప్రేమలేఖ'లో కోపం వస్తే తల గోడలకేసి బాది క్రాకులు సృష్టించే సుత్తి వీరభద్రరావు, 'ఆనందభైరవి'లో నవ్వొచ్చినా ఏడుపొచ్చినా కయ్యిన విజిల్ వేసే శ్రీలక్ష్మి, 'ఎదురింటి మొగుడు–పక్కింటి పెళ్లాం'లో స్టాంపు అంటించడానికి కూడా సొంత ఉమ్మును వాడటానికి వెనుకాడే పిసినారి రాజేంద్రప్రసాద్, వాళ్లకూ వీళ్లకూ ఠస్సా ఇచ్చి వీడియోలైబ్రరీ పెట్టే 'ఏప్రిల్ 1 విడుదల' దివాకరం, 'ఆ ఒక్కటీ అడక్కు'లో రొయ్యల నాయుడు రావు గోపాలరావు, అద్దె ఇంటి కోసం ఆడవేషం కట్టే 'చిత్రం భళారే విచిత్రం' నరేష్, 'మనీ'లో ఖాన్‌దాదా, 'శుభాకాంక్షలు'లో 'చరణకింకిణులు గొల్లుగొల్లుమన' పాడే గాయకుడు ఏ.వి.ఎస్, 'నువ్వు నాకు నచ్చావ్'లో తల్లి మీద కవిత్వం చెప్పే ఎమోషనల్ కొడుకు ప్రకాష్ రాజ్... వీరంతా ఈ కరోనా కాలంలో కాసింత దృష్టి మళ్లించే ఔషధాలు... మందులు.

కనుక స్ట్రెస్ మానండి. సినిమా చూడండి.

– సాక్షి ఫ్యామిలీ






● చిరంజీవి

## అది నిజం కాదు

చిరంజీవి హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో నిరంజన్‌రెడ్డితో కలిసి రామ్‌చరణ్ 'ఆచార్య' సినిమా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకి చరణ్ టైమ్ కేటాయించడంలేదనే వార్త సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. దీని గురించి మ్యాట్నీ ఎంటర్‌టైన్‌మెంట్ అధినేత నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ – ''ప్రచారంలో ఉన్న వార్త నిజం కాదు. ఈ సినిమా ప్రారంభం అయినప్పటినుండి ప్రతి విషయంలోను రామ్‌చరణ్ సహకారం పూర్తిగా ఉంది. సినిమాకు సంబంధించిన అన్ని డిస్కషన్స్‌లోనూ మాతో పాటు సమానంగా దగ్గరుండి చరణ్ డెసిషన్స్ తీసుకుంటున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అన్ని బాధ్యతలను కొణిదెల ప్రొడక్షన్స్ అధినేత రామ్‌చరణ్, మ్యాట్నీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్వర్తిస్తున్నాయి'' అన్నారు.

**కరోనా విముక్త భారతాన్ని సాధిద్దాం:** ఆదివారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు స్వచ్ఛందంగా జనతా కర్ఫ్యూని పాటిద్దాం. సాయంత్రం 5 గంటలకు మన గుమ్మాల్లోకి వచ్చి వైద్య సేవలందిస్తున్న వారికి కరతాళ ధ్వనులతో ధన్యవాదాలు చెప్పాల్సిన సమయం ఇది. భారతీయులుగా ఐకమత్యంతో ఈ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొందాం. కరోనా విముక్త భారతాన్ని సాధిద్దాం.

– చిరంజీవి



● ప్రభాస్

## మార్కెట్‌లో ఫైట్

తిబిలిసీ (జార్జియా రాజధాని) లోని ఫ్లీ మార్కెట్‌కు (పాత వస్తువులు, పురాతన వస్తువులు, సెకండ్‌హ్యాండ్ వస్తువులు దొరికే ప్రాంతం) వెళ్లారు ప్రభాస్. అక్కడ ఓ గొడవ జరిగింది. విలన్స్‌ను రఫ్ఫాడించారు ప్రభాస్. రాధాకృష్ణ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'ఓ డియర్' (వర్కింగ్ టైటిల్) అనే చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా నటిస్తున్నారు. గోపీకృష్ణా మూవీస్, యూవీ క్రియేషన్స్ సంస్థలు ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇటీవల ఈ సినిమా జార్జియా షెడ్యూల్ ముగిసింది. అక్కడి ఫ్లీ మార్కెట్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే ఓ ఫైట్‌ను చిత్రీకరించారని సమాచారం. ఈ ఉగాదికి ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేయనున్నారనే ప్రచారం జరుగుతోంది. జార్జియా షెడ్యూల్ తర్వాత హైదరాబాద్ చేరుకున్న ప్రభాస్ అండ్ టీమ్ షూటింగ్‌కి బ్రేక్ ఇచ్చారు. కరోనా కారణంగా ఎవరికివారు ఇంట్లోనే ఉంటున్నారు. ప్రభాస్ కూడా స్వీయ గృహనిర్బంధంలో ఉన్నారు.

## చెక్ మేట్

పని లేని మెదడు పిచ్చి పిచ్చి ఆలోచనలకు కొలువు అంటారు. కానీ ఆ అవకాశం ఇవ్వకుండా మెదడుకి మేత పెట్టారు దేవరకొండ బ్రదర్స్. చెస్ బోర్డ్ తీసి ఒకరికొకరు చెక్ పెట్టుకున్నారు. కరోనా కారణంగా సినిమా షూటింగ్స్ లేకపోవడంతో స్టార్స్ అందరూ ఇంట్లోనే ఉంటున్నారు. తమ హాబీలతో కాలక్షేపం చేస్తున్నారు. విజయ్ దేవరకొండ ఆయన తమ్ముడు ఆనంద్ దేవరకొండ కూడా ఇంటి పట్టునే ఉంటున్నారు. ఈ ఖాళీ సమయంలో సరదాగా చెస్ ఆడుతున్న ఫొటోను షేర్ చేశారు.



● విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ

## కరోనాతో ఫైట్ చేయగలం



● ఓల్గా కురిలెంకో

'క్వాంటమ్ ఆఫ్ సోలేస్' (2008), 'ఒబ్లివిన్' (2013) చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు నటి ఓల్గా కురిలెంకో. దాదాపు ఐదు రోజుల క్రితం ఈ హాలీవుడ్ తార కోవిడ్ 19 (కరోనా వైరస్) బారిన పడ్డట్లు వెల్లడించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆరోగ్యం కాస్త బాగానే ఉందనే విషయాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించారు ఓల్గా. ''కాస్త బెటర్‌గా ఫీల్ అవుతున్నాను. నా జ్వరం పోయింది. నేను ఎక్కడ ఉన్నానా? అని కొందరు ఆలోచిస్తుండొచ్చు. ప్రస్తుతం నేను లండన్‌లో ఉన్నాను. కరోనా వైరస్ బారిన పడ్డానని టెస్ట్ చేయించుకున్నాక తెలిసింది. డాక్టర్లు చెప్పిన మందులతో పాటు వారి సలహా మేరకు విటమిన్స్, కొన్ని సప్లిమెంట్స్ (మెడిసిన్స్, హెల్దీఫుడ్) తీసుకున్నాను. కరోనా వైరస్‌ను విటమిన్స్ నిర్మూలిస్తాయని నేను చెప్పడం లేదు. కానీ మనలోని రోగనిరోధక శక్తిని పెంచుతాయి. డాక్టర్ల సూచనలు పాటించడంతో పాటు మన జాగ్రత్తల్లో మనం ఉంటే కరోనాతో ఫైట్ చేయగలం'' అని పేర్కొన్నారు ఓల్గా. ఆమె నటించిన 'ఎంపైర్స్ ఆఫ్ ది డీప్, ది బే ఆఫ్ సైలెన్స్' చిత్రాలు విడుదలకు రెడీ అవుతున్నాయి.

## త్వరలో మా ఏపీ ఎన్నికలు

''మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్' (మా) ఆంధ్రప్రదేశ్ కార్యవర్గం పదవీ కాలం ముగియడంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడానికి త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నాం'' అని 'మా–ఏపీ' వ్యవస్థాపకుడు, దర్శకుడు దిలీప్ రాజా తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలోని 'మా–ఏపీ' కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ– ''ప్రస్తుతం 'మా–ఏపీ' అధ్యక్షురాలు కవిత, ప్రధాన కార్యదర్శి నరసింహరాజు, సెక్రటరీలు అన్నపూర్ణ, శ్రీలక్ష్మీ.. మిగతా కార్యవర్గ సభ్యులు తమ రాజీనామాలను అందజేయవచ్చు.. తిరిగి ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యాక నామినేషన్‌లు వేసుకోవచ్చు. ఈసారి 'మా–ఏపీ' అధ్యక్ష స్థానానికి ఒక ప్రముఖ హీరో బరిలోకి వచ్చే అవకాశాలున్నాయి. 'మా–ఏపీ'లో శాశ్వత సభ్యత్వం గల సభ్యులందరికీ ఓటు హక్కు ఉంటుంది. తాత్కాలిక సభ్యులకు ఓటు హక్కు ఉండదు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, చెన్నై రాష్ట్రాలకు చెందినవారు పోటీ చేయవచ్చు. కరోనా వైరస్ ప్రభావంతో ఈ నెల 31 వరకు ఏపీలో షూటింగ్‌లు నిలిపివేశాం. ఎవరైనా షూటింగ్‌లు జరిపితే శాశ్వత సభ్యత్వాలను రద్దు చేస్తాం'' అన్నారు. ఈ సమావేశంలో దర్శకులు శ్రీధర్, రత్నాకర్, స్టోరీ బోర్డు సభ్యుడు అశోక్ వడ్లమూడి, ప్రొడక్షన్ మేనేజర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



● దిలీప్‌రాజా

## యుద్ధానికి వెళ్లినట్లుంది




● రకుల్ ప్రీత్‌సింగ్

ఇటీవల మూడు హిందీ సినిమాలకు (జాన్ అబ్రహాం 'ఎటాక్', అజయ్‌దేవగన్ – సిద్ధార్థ్ మల్హోత్రా 'థ్యాంక్ గాడ్', అర్జున్ కపూర్ సరసన ఓ సినిమా) సైన్ చేసి, బాలీవుడ్ ట్రాక్‌పై స్పీడ్ పెంచారు రకుల్‌ప్రీత్ సింగ్. అయితే కరోనా వైరస్ కారణంగా సినిమాల షూటింగ్స్ అన్నీ బంద్ అయిన సంగతి తెలిసిందే. సైన్ చేసిన సినిమాల షూటింగ్స్ అనుకున్న సమయానికి జరగకపోవడం వల్ల తన మూవీ కాల్షీట్లు క్లాష్ అవుతాయని కంగారు పడుతున్నారు రకుల్. ఈ విషయం గురించి ఆమె మాట్లాడుతూ – ''కరోనా వైరస్ ప్రభావం లేకపోయినట్లయితే ఈ సమయంలో ప్రతిరోజూ నేను షూటింగ్స్‌లో పాల్గొనాల్సింది. కానీ షూటింగ్స్ అన్నీ క్యాన్సిల్ అయ్యాయి. బ్రేక్ తర్వాత ఒకేసారి షూటింగ్స్ మొదలైతే నా డేట్స్‌ను ఎలా సర్దుబాటు చేయాలో అర్థం కావడంలేదు. నా కెరీర్‌లో ఇది పెద్ద బ్రేక్. కరోనా వైరస్ ఇండస్ట్రీ మొత్తాన్ని కలవరపెడుతోంది. అసలు ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే ఏదో యుద్ధానికి వెళ్లిన ఫీలింగ్ కలుగుతోంది'' అన్నారు రకుల్.

## ఇంట్లోనే ఉందాం

**కోవిడ్ 19 (కరోనా వైరస్)ను అధిగమించడానికి ప్రధాని మోదీ నేడు (ఆదివారం) జనతా కర్ఫ్యూ (ఉదయం ఏడుగంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఇంటిలోపలే ఉండటం)కు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. పౌరులందరూ ఈ జనతా కర్ఫ్యూలో పాల్గొని కరోనా వైరస్‌ను అధిగమించాలని కొందరు స్టార్స్ కూడా సోషల్ మీడియాలో ఈ విధంగా ట్వీట్స్ చేశారు.**





ఇటలీ ప్రస్తుతం దారుణ పరిస్థితులను ఎదుర్కొంటోంది. కరోనా వైరస్ మహమ్మారి కారణంగా అక్కడ మరణాల సంఖ్య మెండుగా ఉంది. అలాంటి పరిస్థితులు మన దేశంలో తలెత్తకూడదు. ప్రధాని మోదీ పిలుపునిచ్చిన జనతా కర్ఫ్యూలో పాల్గొందాం. స్వీయ గృహనిర్బంధం, సామాజిక దూరం పాటిద్దాం.

– రజనీకాంత్

ప్రధాని పిలుపునిచ్చిన జనతా కర్ఫ్యూకు కట్టుబడి ఉందాం. ఈ అసాధారణమైన పరిస్థితుల్లో అసాధారణ రీతిలో జాగ్రత్తలు తీసుకుందాం


– కమల్ హాసన్






మోదీగారు పిలుపునిచ్చిన జనతా కర్ఫ్యూలో భాగస్వాములం అవుదాం. కరోనా విపత్కర పరిస్థితులను కట్టడి చేసేందుకు సామాజిక దూరాన్ని పాటిద్దాం

– నాగార్జున



ఈ ఆదివారం మార్చి 22 ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు జనతా కర్ఫ్యూను పాటిద్దాం

– వెంకటేశ్




జనతా కర్ఫ్యూకు అందరం సపోర్ట్ చేద్దాం. కరోనా వైరస్‌పై సమిష్టిగా పోరాడదాం

– మహేశ్‌బాబు



కరోనా వైరస్‌పై పోరాడటానికి స్వీయ గృహనిర్బంధం, సామాజిక దూరం.. ఈ రెండూ బలమైన ఆయుధాలు. కరోనాని జయించాలంటే అందరం మనవంతు కృషి చేయాలి. జనతా కర్ఫ్యూని విజయవంతం చేసి మన ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.

– ఎన్టీఆర్



జనతా కర్ఫ్యూలో భాగంగా పౌరులందరూ ఇళ్లలోనే ఉండాలని కోరుకుంటున్నాను. సమిష్టిగా పోరాడి కరోనాను అధిగమిద్దాం

– రాజమౌళి



మన ఇంట్లోకి ఎవరైనా వస్తే చెంబుతో నీళ్లిచ్చి, కాళ్లు కడుక్కున్నాకే ఇంట్లోకి రమ్మంటాం, అలాంటి సంప్రదాయం మనది. అలాంటిది ఈ మహమ్మారి కరోనా వస్తానంటే రానిస్తామా? అందుకే మన దేశం కోసం, మనందరి ఆరోగ్యం కోసం మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీగారు చెప్పిన జనతా కర్ఫ్యూని పాటిద్దాం. ఈ రోజు ఉదయం 7గంటల నుండి రాత్రి 9 గంటల వరకు మన ఇళ్లల్లో మనమే ఉంటూ బయటివారిని ఎవరినీ రానివ్వకుండా వీలైనంత పరిశుభ్రతను పాటించడం ఈ రోజు ముఖ్యోద్దేశ్యం. అలా ఇంట్లో ఉండి మన వంటలను మనమే చేసుకుని మనమే తింటూ ఇంట్లో ఉందాం. మనందరం ఒకటే అని నిరూపించటం కోసం సాయంకాలం 5 గంటలకు మన ఆనంద హర్షాతిరేకానికి గుర్తుగా మన దేశ పౌరులందరూ ఒక్కటే అనుకుని చేతులన్నీ శుభ్రం చేసుకొని ఒక్కసారి చప్పట్లు కొడదాం. అలా చేసి, మనందరం ఒకటే అని నిరూపిద్దాం. జైహింద్.

– రాజేంద్రప్రసాద్

కంటికి కనిపించని శత్రువుపై సమర శంఖం..
చాపకింద నీరులా విస్తరిస్తున్న కోవిడ్‌పై
సర్కార్ యుద్ధం..
సమూహాల నుంచి సమూహాలకు
విస్తరించకుండా క్రిమి సంహారం..
కేంద్రం ఇచ్చిన పిలుపు విందాం.
ప్రజల కోసం ప్రజలే నిర్వహించే
జనతా కర్ఫ్యూ పాటిద్దాం.
కరోనా నుంచి మనల్ని కాపాడుకుందాం.

# దయచేసి వినండి

- ఇవాళే జనతా కర్ఫ్యూ
- ఉదయం 7 నుంచి రాత్రి 9 వరకు
- 14 గంటలు ఎవరిళ్లలో వారే స్వీయ నిర్బంధం

**న్యూఢిల్లీ:** ప్రపంచ దేశాలను వణికిస్తున్న కరోనా వైరస్ భారత్‌లోనూ శరవేగంగా విస్తరిస్తోంది. ఈ మహమ్మారికి చికిత్స లేదు. నివారణే మార్గం. ఇందుకు సామాజిక దూరం పాటించడానికి మించిన దారి లేదు. అందుకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రజలందరూ ఇళ్లలోనే గడపాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యపరంగా అత్యవసరమైతే తప్ప ఇల్లు వదిలి బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. బహిరంగ ప్రదేశాలకు రాకుండా సమూహాలకు దూరంగా ఉండాలని ప్రధాని మోదీ ఒక ప్రకటన చేశారు. ప్రభుత్వం ఇచ్చిన పిలుపును పాటించాల్సిన బాధ్యత ఇప్పుడు ప్రతీ ఒక్క పౌరుడి మీద ఉంది. ప్రతీ ఒక్కరిలోనూ ప్రభుత్వం ఎందుకింత కఠినమైన ఆంక్షలు విధిస్తోందో అవగాహన రావాలి. కేవలం ప్రజలే కాదు నాయకులు, సెలబ్రిటీలు కూడా జనతా కర్ఫ్యూ పాటించడానికి సిద్ధమయ్యారు. అత్యవసర సేవలు అందించే వైద్యులు, పోలీసులు, మీడియా ఈ కర్ఫ్యూ పరిధిలోకి రావు. వీరు మినహా యావత్ భారతావని స్వీయ నిర్బంధంలోకి వెళ్లిపోతోంది. కరోనా వంటి మహమ్మారి సోకితే సొంత కుటుంబ సభ్యులే దూర దూరంగా ఉండే వేళ ఓర్పుతో, సహనంతో తమ ప్రియమైన వాళ్లని వదిలి వచ్చి మరీ రేయింబవళ్లు సేవలు చేస్తున్న వివిధ వర్గాలకు ధన్యవాదాలు చెప్పుకోవాలి కదా. ప్రధాని పిలుపు మేరకు సరిగ్గా సాయంత్రం అయిదు గంటలకి అందరం వారి వారి ఇంటి బాల్కనీ నుంచి లేదంటే, ఇంటి బయట గుమ్మం దగ్గరకు వచ్చి అయిదు నిమిషాల సేపు గట్టిగా చప్పట్లు కొడదాం. కరోనా మహమ్మారిని ఎదుర్కోవడానికి అహర్నిశలు కష్టపడుతున్న వారికి ధన్యవాదాలు చెబుదాం.

**జనతా కర్ఫ్యూపై దృష్టి పెట్టండి..**

కరోనా వైరస్‌ను ఎదుర్కోవడానికి ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం జనతా కర్ఫ్యూ పకడ్బందీగా అమలు జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలందరూ కూడా తమంతట తాముగా జనతా కర్ఫ్యూను పాటించాలని అజయ్ భల్లా శనివారం రాష్ట్రాలకు రాసిన లేఖలో కోరారు. కోవిడ్ మహమ్మారిని ఎదుర్కోవడానికి గుండె నిబ్బరంతో పని చేస్తున్న వైద్య సిబ్బంది, పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, విమానయాన సిబ్బంది, మీడియా ప్రతినిధులు, బస్సు, రైలు, ఆటో డ్రైవర్లు, హోం డెలివరీ బాయ్స్‌కి తమ కృతజ్ఞతలు తెలుపుతూ సాయంత్రం అయిదు గంటలకి ప్రజలందరూ తమ ఇళ్లల్లోని బాల్కనీల్లో నిల్చొని అయిదు నిమిషాల సేపు చప్పట్లు కొట్టాలని, లేదంటే ఇంట్లో ఉన్న బెల్స్ మోగించాలన్నారు. సమాచారం అందరికీ చేరేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని భల్లా రాష్ట్రాల ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. సాయంత్రం అయిదు గంటలకి చప్పట్లు కొట్టాలన్న విషయాన్ని గుర్తు చేయడానికి స్థానిక సంస్థలు, అగ్నిమాపక సర్వీసులు, రక్షణ సిబ్బంది అదే సమయంలో సైరన్ మోగించాలని భల్లా ఆ లేఖలో కోరారు.


కరోనా భయంతో జనం ఇళ్లకే పరిమితం కావడంతో బోసిపోయిన కోల్‌కతా ఫ్లై ఓవర్

## ఎక్కడివన్నీ అక్కడే

- మార్చి 21 అంటే శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం రాత్రి 10 గంటల వరకు భారతీయ రైల్వే దేశవ్యాప్తంగా ప్యాసింజర్ సర్వీసుల్ని నిలిపివేసింది. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల నుంచి మెయిల్, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నిలిచిపోయాయి. ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లు కూడా రాత్రి 10 గంటలవరకు నిలిచిపోనున్నాయి. దేశవ్యాప్తంగా 3,700 రైళ్లను రద్దు చేశారు.
- ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై మహా నగరాల్లో అన్ని సబర్బన్ రైలు సర్వీసుల్ని ఆదివారం నిలిపివేశారు. ఢిల్లీలో మెట్రో రైలు సర్వీసుల్ని నిలిపివేస్తున్నట్టు ఆ సంస్థ ప్రకటించింది.
- గో ఎయిర్ విమానయాన సంస్థ స్వచ్ఛందంగా ఆదివారం అన్ని విమాన సర్వీసుల్ని నిలిపివేసింది. భారత్‌లో అత్యధిక విమాన సర్వీసుల్ని నడిపే ఇండిగో 60% వరకు డొమెస్టిక్ సర్వీసుల్ని నడుపుతోంది. ఎయిర్ విస్తా తన సర్వీసుల్ని బాగా కుదించింది.
- ఉబెర్, ఓలా వంటి క్యాబ్ సర్వీసులు కూడా ఎమర్జెన్సీ ఉన్నవారికే అందుబాటులో ఉంటాయి
- రాజధాని ఢిల్లీలో 95 వేల ఆటోరిక్షాలు ప్రధాని పిలుపు మేరకు స్వచ్ఛందంగా బంద్ పాటించాలని నిర్ణయించాయి.
- ఢిల్లీలో 15 లక్షల మంది వ్యాపారులు తమ దుకాణాలు బంద్ చేయాలని నిర్ణయించారు. వారిలో కొందరు మార్చి 21 నుంచి 23 వరకు బంద్ పాటిస్తున్నారు.
- గుజరాత్, కర్ణాటక, తమిళనాడు ప్రభుత్వాలు జనతా కర్ఫ్యూకు మద్దతుగా బస్సు సర్వీసుల్ని నిలిపివేస్తున్నట్టు ప్రకటించాయి.


అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో ఒక ఏటీఎంను వాడేముందు శానిటైజర్‌ను స్ప్రే చేస్తున్న కస్టమర్

## కరోనా విలయం స్థూలంగా..

| | |
|---|---|
| ప్రపంచవ్యాప్తంగా మరణాలు | 11,737 |
| వైరస్ సోకినవారు | 2,77,106 |
| ప్రభావితమైన దేశాలు | 164 |
| ఇళ్లకు పరిమితమైనవారు | 100 కోట్లు |

- కొలంబియాలో మంగళవారం నుంచి గృహ నిర్బంధం అమల్లోకి రానుంది.
- అమెరికాలోని కాలిఫోర్నియా, ఇల్లినాయి, న్యూయార్క్, పెన్సెల్వేనియా, న్యూజెర్సీ, కనెక్టికట్, నెవెడాల్లోనూ ప్రజలు ఇళ్లకే పరిమితం. ప్రతి ఐదుగురు అమెరికన్లలో ఒకరిపై కరోనా వైరస్ ప్రభావం ఉంది.

| దేశం | మరణాలు | కేసులు |
|---|---|---|
| ఇటలీ | 4,825 | 53,578 |
| చైనా | 3,255 | 81,008 |
| ఇరాన్ | 1,556 | 20,610 |
| స్పెయిన్ | 1,326 | 24,926 |
| ఫ్రాన్స్ | 450 | 12,612 |

### నిబంధనలు కఠినతరం

స్విట్జర్లాండ్‌లో ప్రజలందరూ ఇళ్లకే పరిమితం కావాలని ఆదేశాలు చేశారు. ఐదుగురు కంటే ఎక్కువ మంది గుమికూడదని, రెండు మీటర్ల ఎడం కంటే తక్కువ ఉంటే ప్రజలకు జరిమానా విధించాలని నిర్ణయాలు తీసుకుంది. హైతీ, డొమినికన్ రిపబ్లిక్, జోర్డాన్, బుర్కినా ఫాసోల్లోనూ కర్ఫ్యూలు అమల్లోకి వచ్చాయి. కరోనా కారణంగా పర్యాటక రంగంపై ఎక్కువగా ఆధారపడే క్యూబాలో ఇతర దేశస్తులకు ప్రవేశాన్ని 30 రోజులపాటు నిషేధించారు. ఐవరీ కోస్ట్, బుర్కినా ఫాసోలు త్వరలోనే సరిహద్దులను మూసేయనుండగా బ్రెజిల్ సోమవారం ఆ పని చేయనుంది. యూరప్, ఆస్ట్రేలియా, పలు ఆసియా దేశాల నుంచి పర్యాటకుల రాకపై నిషేధం విధించింది.

### వ్యాపారాలకూ దెబ్బే

స్మార్ట్‌ఫోన్ రవాణా ఫిబ్రవరి నెలలో కనిష్ఠ స్థాయికి చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఈ తగ్గింపు 38 శాతం తక్కువ. ఎయిర్ కెనడా, ఎయిర్ ట్రాన్స్‌సాట్‌లు ఏడు వేల మంది ఉద్యోగులను తాత్కాలికంగా ఉద్యోగాల నుంచి తొలగించింది. పారిశ్రామిక ఉత్పత్తిని గ్వాటెమాలా నిలిపివేయనుంది.

# ఎగబాకుతున్న కరోనా కేసులు

- ఒక్కరోజులో 60 కొత్త కేసులు
- భారత్‌లో 283కు చేరిన కేసులు
- పలు రాష్ట్రాల్లో నియంత్రణ చర్యలు
- ఢిల్లీలో పింఛన్లు రెట్టింపు
- 50 శాతం ఎక్కువ రేషన్ సరుకులు

**న్యూఢిల్లీ:** ఒకే రోజు భారత్ మొత్తమ్మీద 60 కొత్త కరోనా కేసులు నమోదు కావడంతో ఇప్పటివరకూ ఈ వ్యాధి బారిన పడ్డ వారి సంఖ్య 283కు చేరినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారం తెలిపింది. వీరిలో వ్యాధి కారణంగా మరణించిన ఐదుగురితోపాటు 39 మంది విదేశీయులు (ఇటలీ 17, ఫిలిప్పీన్స్ 3, యూకే 2, కెనడా, ఇండోనేసియా, సింగపూర్‌ల నుంచి ఒక్కొక్కరు) కూడా ఉన్నారని అధికారులు తెలిపారు. మహారాష్ట్రలో వైరస్ బాధితుల సంఖ్య 63కు చేరుకోగా ఇందులో నలుగురు విదేశీయులు ఉన్నారు. కేరళలో ఏడుగురు విదేశీయులతో కలిపి 40 మంది వ్యాధి బారిన పడ్డారు. ఢిల్లీలో ఒక విదేశీయుడితో కలిపి 26 మంది, ఉత్తరప్రదేశ్‌లో ఒక విదేశీయుడు, 24 మంది, తెలంగాణలో 11 మంది విదేశీయులతో కలిపి 21 మంది, రాజస్తాన్‌లో ఇద్దరు విదేశీయులతో కలిపి 17 మంది హరియాణాలో 14 మంది విదేశీయులు, ముగ్గురు భారతీయులు వ్యాధి బారిన పడినట్లు అధికారులు చెప్పారు. కర్ణాటకలో మొత్తం 15 మంది కోవిడ్ బాధితులు ఉండగా, పంజాబ్, లడాఖ్‌లలో 13 మంది చొప్పున, గుజరాత్‌లో ఏడుగురు, కశ్మీర్‌లో నలుగురు ఉన్నారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్‌లలో ముగ్గురు చొప్పున వ్యాధి బారిన పడ్డారు. పుదుచ్చేరి, చత్తీస్‌గఢ్, చండీగఢ్‌లలో ఒక్కో కేసు నమోదైంది. విద్యా సంస్థల హాస్టళ్లలో ఉన్న విద్యార్థులను అక్కడే ఉండనివ్వాలని, తగిన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని మానవ వనరుల మంత్రిత్వశాఖ దేశంలోని విద్యా సంస్థలకు సూచించింది.

**యూపీ మంత్రికి నెగెటివ్**

కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయిన గాయని కనిక కపూర్‌తో ఒక పార్టీలో గడిపిన ఉత్తరప్రదేశ్ మంత్రి జై ప్రతాప్ సింగ్ కోవిడ్ బారిన పడలేదని శనివారం స్పష్టమైంది. కనిక కపూర్ పార్టీలో గడిపిన తర్వాత జై ప్రతాప్ ఇంటికే పరిమితం కాగా.. ఆయన రక్త నమూనాల్లో వైరస్ లేనట్లు పరీక్షలు స్పష్టం చేశాయి. జై ప్రతాప్‌తో సన్నిహితంగా మెలిగిన 28 మందికీ వ్యాధి సోకనట్లు స్పష్టమైందని కింగ్ జార్జ్ మెడికల్ వర్సిటీ అధికార ప్రతినిధి డాక్టర్ సుధీర్ సింగ్ తెలిపారు. తనకు కరోనా సోకినట్లు కనిక కపూర్ ప్రకటించిన తరువాత ఆ గాయనితో సన్నిహితంగా మెలిగిన రాజస్తాన్ మాజీ సీఎం వసుంధర రాజే, కుమారుడు దుష్యంత్ సింగ్‌లు సెల్ఫ్ క్వారంటైన్‌లోకి వెళ్లడం తెల్సిందే.

**ఆన్‌లైన్‌లో విలేకరుల సమావేశం**

కరోనా వైరస్ ఉధృతిని దృష్టిలో ఉంచుకుని ఇకపై విలేకరుల సమావేశాలన్నింటినీ ఆన్‌లైన్ మార్గంలో నిర్వహించాలని ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా విలేకరులు వ్యాధి బారిన పడకుండా నివారించవచ్చునన్నది ప్రభుత్వ ఉద్దేశం. 'కరోనాపై పోరులో ముందు వరుసలో ఉన్న విలేకరులు తమను తాము రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే ఇకపై ఢిల్లీ ప్రభుత్వపు అన్ని విలేకరుల సమావేశాలను ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తాం' అని సీఎం కేజ్రీవాల్ ట్వీట్‌చేశారు. ఢిల్లీలో పేదలను ఆదుకునేందుకు వచ్చే నెల యాభై శాతం రేషన్ సరుకులు ఎక్కువగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. దీంతోపాటు వితంతు, దివ్యాంగుల, వృద్ధాప్య పింఛన్లను రెట్టింపు చేశారు

**పలు రాష్ట్రాల్లో నియంత్రణ చర్యలు**

ఛత్తీస్‌గఢ్, ఒడిశాలలో మార్చి 31వరకు నియంత్రణలు విధిస్తున్నట్లు ఆయా రాష్ట్రాల సీఎంలు తెలపగా గోవా మొత్తం 144 సెక్షన్ విధిస్తూ ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసింది. మహారాష్ట్రలోని నాసిక్‌లో స్టార్‌హోటళ్లతోపాటు అన్నిచోట్ల మద్యం అమ్మకాలను నిలిపివేశారు. బెంగాల్‌లో అన్ని బార్లు, పబ్‌లు, హోటళ్లను బంద్ చేశారు.


మాస్క్‌లు ధరించిన ప్రయాణికులతో నిండిపోయిన ముంబైలోని లోకమాన్య తిలక్ టెర్మినస్

### అత్యవసర వైద్యం కోసం శిక్షణ

కరోనా వైరస్ ప్రభావం మరింత తీవ్రతరమైన అత్యవసర పరిస్థితులు ఏర్పడితే వ్యాధిపీడితులకు తగిన చికిత్స అందించేందుకు దేశంలోని వెయ్యి ప్రాంతాల్లో కొంతమందికి వీడియో ద్వారా శిక్షణ ఇచ్చినట్లు ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారం తెలిపింది. అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలన్న అంశంపై ఆదివారం ఒక డమ్మీ డ్రిల్ చేపట్టనున్నట్లు ఆరోగ్యశాఖ జాయింట్ సెక్రటరీ లవ్ అగర్వాల్ తెలిపారు. కరోనా వైరస్ పరీక్షలకు సంబంధించిన మార్గదర్శకాల్లో మార్పులు జరిగాయని, లక్షణాలు లేకున్నా వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్న వారికి ఐదు, 14వ రోజుల్లో పరీక్షలు నిర్వహించాలని తాజాగా ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన వివరించారు. మాస్కులు, శానిటైజర్ల కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేస్తోందని, డియోడరెంట్లు తయారు చేసే కంపెనీలు శానిటైజర్లు తయారు చేసేందుకు రాష్ట్రాలు అనుమతివ్వాలని సూచించారు. మాస్కుల వాడకంపై చాలా అపోహలు ఉన్నాయని, ఇవి అందరికీ అవసరం లేదని మనుషులకు కొంచెం దూరంగా ఉండటం వైరస్ వ్యాప్తి నిరోధానికి ముఖ్యమని వివరించారు. ప్రభుత్వం ఇప్పటివరకు విదేశాల్లో చిక్కుకుపోయిన 1700 మంది భారతీయులను తిరిగి తెచ్చిందని తెలిపారు. సామూహిక వ్యాప్తి జరుగుతోందా? అన్న ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ.. అలా జరిగినప్పుడు ప్రజలకు తెలియజేస్తామని అన్నారు. కోవిడ్ బారిన పడ్డ వారికి సన్నిహితంగా ఉన్న సుమారు 7000 మందిని గుర్తించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

### ప్రయాణాలు వద్దు: మోదీ

వలసదారులు సహా ప్రజలంతా ఎక్కడి వారక్కడే ఉండిపోవాలని, కరోనా భయంతో సొంతూళ్లకు వెళ్లేందుకు బస్సులు, రైళ్లలో ప్రయాణాలు చేయవద్దని ప్రధాని కోరారు. ఇలాంటి సమయాల్లో ప్రయాణాలు చేసేవారు, తమతోపాటు కుటుంబసభ్యుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేసినట్లేనని హెచ్చరించారు. ఎవరూ ఎక్కడికీ వెళ్లవద్దని కోరారు. నగరాల్లో కరోనా కేసులు బయటపడటంతో జనం భయంతో సొంతూళ్లకు వెళుతున్నారంటూ వచ్చిన వార్తల నేపథ్యంలో మోదీ మాట్లాడారు. రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లు, బస్టాండ్లకు వెళ్లడం వల్ల వైరస్ ముప్పు మరింత పెరుగుతుందన్నారు. అలాగే, సొంతూళ్లకు వెళితే అక్కడి వారికి కూడా ఈ వ్యాప్తి విస్తరించే ప్రమాదముందని పేర్కొన్నారు. అందుకే, అత్యవసరమైతేనే బయటకు అడుగుపెట్టాలని దేశ ప్రజలకు ప్రధాని విజ్ఞప్తి చేశారు.


కొత్త కేబినెట్ మంత్రులతో గ్రూప్ ఫొటో దిగుతున్న స్లొవేకియా అధ్యక్షురాలు జురానా(మధ్యలో)

# యువత అతీతం కాదు

స్పష్టం చేసిన ప్రపంచ ఆరోగ్య సంస్థ • 11వేలు దాటిన మృతుల సంఖ్య
ఇటలీలో ఒక్కరోజే 793 మంది మృతి • ప్రపంచవ్యాప్తంగా జనజీవనం అస్తవ్యస్తం

**రోమ్:** ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ వయో వృద్ధులను ఎక్కువగా బాధిస్తున్నప్పటికీ యువత ఈ మహమ్మారికి అతీతమేమీ కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేసింది. కరోనా వైరస్ తాకిడికి ప్రపంచం దాదాపుగా స్తంభించిపోగా.. జన జీవనం అస్తవ్యస్తమైనట్లు తెలుస్తోంది. వ్యాపారాలు, విద్యాలయాలు మూతపడిపోవడం, లక్షల మంది ఇళ్ల నుంచే పనిచేసుకోవడం మొదలుపెట్టడంతో మహానగరాలూ బోసిపోయి కనిపిస్తున్నాయి. ఇటలీలో ఒక్కరోజే 793 మంది మృతి చెందారు. ఈ మహమ్మారి బారిన పడి ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య ప్రపంచవ్యాప్తంగా 11,737కు చేరుకుంది. ఇందులో 4వేలమంది ఇటలీ వారే కావడం గమనార్హం. వ్యాధి బారిన పడ్డ వారి సంఖ్య 160 దేశాల్లో 2.75 లక్షలు దాటింది. అగ్రరాజ్యం అమెరికాలో కరోనా పీడితుల సంఖ్య పెరిగిపోతున్న నేపథ్యంలో కాలిఫోర్నియాతోపాటు న్యూయార్క్, ఇల్లినాయిల్లోనూ ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు కోరాయి. మరోవైపు వైరస్‌కు పుట్టినిల్లు అయిన చైనాలో వరుసగా మూడవ రోజూ కొత్త కేసులేవీ నమోదు కాకపోవడం గమనార్హం. ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రియాసిస్ శనివారం రోమ్‌లో మాట్లాడుతూ జబ్బు లక్షణాలు లేకపోయినా యువత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎక్కడికి వెళుతున్నారన్న విషయంపై వ్యాధి సోకే అవకాశాలు పెరిగిపోతాయని స్పష్టం చేశారు.

**యూరప్‌లో కట్టడి చర్యలు ముమ్మరం**

ఇటలీసహా యూరప్‌లో వైరస్ కట్టడి చర్యలు ముమ్మరమయ్యాయి. ఇటలీలో కోవిడ్ కారణంగా మరణించిన వారి సంఖ్య ప్రపంచవ్యాప్త మరణాల్లో 36 శాతానికి చేరుకుందంటే పరిస్థితి తీవ్రత ఏమిటన్నది ఇట్టే అర్థం చేసుకోవచ్చు. పైగా ఈ దేశంలో వ్యాధి బారిన పడుతున్న ప్రతీ100మందిలో 9మంది మరణిస్తున్నారు. ఫ్రాన్స్, స్పెయిన్ తదితర దేశాల్లోనూ నిబంధనలను అతిక్రమించిన వారిపై భారీ జరిమానాలు విధించడం మొదలైంది. బ్రిటన్ తాజాగా పబ్బులు, హోటళ్లు, థియేటర్లను మూసివేసేందుకు ఆదేశాలు జారీ చేసింది. ఈ కారణంగా ఉపాధి కోల్పోయే వారికి తగిన పరిహారం అందించాలని నిర్ణయించారు.

**ఇరాన్‌లో మరో 123 మంది..**

ఇరాన్‌లో కరోనా మరణ మృదంగపు ధ్వనులు పెచ్చరిల్లుతున్నాయి. ఒక్క రోజు వ్యవధిలో 123 మంది కరోనాకు బలవడంతో శనివారం నాటికి దేశవ్యాప్తంగా మరణించిన వారి సంఖ్య 1556కు చేరుకుందని ఆరోగ్యశాఖ అధికారి కియానౌష్ తెలిపారు. ఇరాన్‌లో 20,610కి వైరస్ సోకిందని వివరించారు. ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ప్రజలు వాటిని పట్టించుకోవడం లేదని మార్చి 17 తేదీ నుంచి వైరస్ ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతం నుంచి కొన్ని లక్షల మంది రోడ్డు మార్గం ద్వారా ఇతర ప్రాంతాలకు వెళ్లారని ఇరానియన్ రెడ్ క్రిసెంట్ సంస్థ తెలిపింది.

**కాలిఫోర్నియాలో వేయిపైనే**

అమెరికాలోని ఒక్క కాలిఫోర్నియా రాష్ట్రంలోనే వెయ్యికిపైగా కేసులు నమోదు కావడం, 19 మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో ఇతర రాష్ట్రాలూ ఒక్కటొక్కటిగా మేల్కొనడం మొదలైంది. ఏడు రాష్ట్రాల్లో పది కోట్ల మందిని ఇళ్లకే పరిమితం చేసేశారు. ఏడు వేల కేసులు, 39 మరణాలు సంభవించిన న్యూయార్క్‌తోపాటు ఇల్లినాయిలో ప్రజలను ఇళ్లలోనే ఉండిపోవాల్సిందిగా అధికారులు విజ్ఞప్తి చేశారు. అయితే అధ్యక్షుడు ట్రంప్ మాత్రం అన్ని రాష్ట్రాల్లోనూ లాక్‌డౌన్ అవసరం లేదని చెప్పారు. అమెరికా, మెక్సికోల మధ్య రాకపోకలు అత్యవసర అవసరాలకు పరిమితం చేసేందుకు అంగీకారం కుదిరిందన్నారు. ఉపాధ్యక్షుడు పెన్స్ సిబ్బందిలో ఒకరికి కరోనా సోకినట్లు శుక్రవారం తెలిసింది. దేశం మొత్తమ్మీద ఇప్పటివరకూ 230 మంది వ్యాధి కారణంగా మరణించారు. ఆఫ్రికన్ దేశం గబాన్‌లో తాజాగా ఒక కొత్త కరోనా కేసు బయట పడింది. దక్షిణ అమెరికా దేశాలు క్యూబా, బొలీవియాలు తమ దేశ సరిహద్దులను మూసివేస్తున్నట్లు ప్రకటించగా కొలంబియా కూడా ప్రజలందరికీ నిర్బంధ ఐసొలేషన్‌ను మొదలుపెట్టనున్నట్లు తెలిపింది.

- **సీబీఎస్‌ఈ టోల్‌ఫ్రీ నంబర్:** వైరస్ నేపథ్యంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) టోల్ ఫ్రీ నంబర్‌ను ప్రారంభించింది. ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు 1800118004 నంబర్‌పై ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుంది.
- **శానిటైజర్ల ధర:** మాస్కులు, శానిటైజర్ల ధరలు పెరగకుండా కేంద్రం చర్యలు చేపట్టింది. వాటి గరిష్ట ధరలను శనివారం ప్రభుత్వం నిర్ణయించింది. 200 మి.లీటర్ల శానిటైజర్ ధర రూ.100 మించకూడదు. రెండు పొరల సర్జికల్ మాస్క్ ధర రూ. 8, మూడు పొరల సర్జికల్ మాస్క్ ధర రూ.10 మించకూడదు.
- **కూలీలకు నగదు:** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం కూలీలకు రూ. 1,000 నగదును, భవన నిర్మాణ కూలీలకు ఒక నెల రేషన్‌ను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు యూపీ సర్కార్ ప్రకటించింది.
- **సార్క్‌కు విరాళం:** కరోనాను ఎదుర్కొనేందుకు సార్క్ కరోనా ఎమర్జెన్సీ ఫండ్‌కు అఫ్గాన్ ప్రభుత్వం ఒక మిలియన్ డాలర్ల విరాళం ఇవ్వగా, మాల్దీవుల ప్రభుత్వం రెండు లక్షల డాలర్ల నిధులు ప్రకటించింది.

### రైల్వే టికెట్ రిఫండ్ నిబంధనల సడలింపు



**న్యూఢిల్లీ:** మార్చి 21 నుంచి జూన్ 21 వరకు రిజర్వేషన్లు చేసుకున్న ప్రయాణికులకు రిఫండ్ నిబంధనలను సడలిస్తున్నట్టు రైల్వే ప్రకటించింది. రైళ్లు రద్దయినా టికెట్ రిఫండ్ కోసం రైల్వే స్టేషన్లలో జనం క్యూ కట్టకుండా ఉండేందుకు ఈ సడలింపు చేశారు. మార్చి 21 నుంచి జూన్ 21 వరకు రైళ్లు రద్దయినట్టయితే బుక్ చేసుకున్న టికెట్ చూపించి, ఆ మొత్తాన్ని 90 రోజుల్లోపు ఎప్పుడైనా తిరిగి ప్రయాణికులు పొందే అవకాశాన్ని రైల్వే శాఖ కల్పించింది. ప్రస్తుతం ఉన్న నిబంధన ప్రకారం మూడు రోజుల్లోపు మాత్రమే ఈ మొత్తాన్ని తిరిగి పొందే అవకాశం ఉంది. అయితే కరోనా వ్యాప్తి రీత్యా దీన్ని 90 రోజులకు పెంచారు. ఒకవేళ రైలు రద్దు కాకుండా ప్రయాణికుడే తన ప్రయాణాన్ని రద్దు చేసుకోవాలని భావించినా, ప్రయాణం తేదీ నుంచి 90 రోజుల్లోపు టీడీఆర్ (టికెట్ డిపాజిట్ రిసిప్ట్) చూపించి టిక్కెట్టు ధర మొత్తాన్ని స్టేషన్‌లోనే తిరిగి పొందే వీలు కల్పించారు. టీడీఆర్‌ను చీఫ్ క్లెయిమ్స్ ఆఫీసర్‌కు సమర్పించాలి.

### ఉ.కొరియా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం

**సియోల్:** ప్రపంచమంతా కరోనా మహమ్మారితో ఒకవైపు తల్లడిల్లుతుండగా ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జొన్ ఉంగ్ తన పంథాలోనే వెళ్తున్నారు. తాజాగా మరోసారి క్షిపణి ప్రయోగం చేపట్టారు. కిమ్ శుక్రవారం ఉదయం సోంచన్ కౌంటీలోని ఓ ప్రాంతంలో క్షిపణి ప్రయోగాలను పర్యవేక్షిస్తున్నట్లుగా ఉన్న ఫొటోలను అధికార మీడియా విడుదల చేసింది. 700 మంది సభ్యులతో కూడిన పార్లమెంట్ సమావేశం ఏప్రిల్ 10న ఉంటుందని ఈ క్షిపణి ప్రయోగానికి ముందుగా అధికార మీడియా ప్రకటించింది. ఉ.కొరియా శుక్రవారం రెండు స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను సముద్రంపైకి ప్రయోగించినట్లు సమీప పొరుగు దేశాలు దక్షిణ కొరియా, జపాన్ కూడా ధ్రువీకరించాయి. ఇవి 410 కిలోమీటర్ల మేర ప్రయాణించి సముద్రంలో పడిపోయాయని ద.కొరియా సైన్యం తెలిపింది.ఉత్తర కొరియాపై కరోనా ప్రభావానికి సంబంధించి బయటి ప్రపంచానికి ఎటువంటి సమాచారం లేదు. అయితే, ఆ దేశంలో కరోనా కేసులు భారీగా ఉంటాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# పీఎల్‌ఐ పథకాలకు కేబినెట్ ఆమోదం

- దేశీయంగా ఎలక్ట్రానిక్, వైద్య పరికరాల తయారీకి ప్రోత్సాహం
- వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు ఓకే

**న్యూఢిల్లీ:** దేశీయంగా వైద్య పరికరాల తయారీని ప్రోత్సహించడానికి రూ.3,420 కోట్ల రూపాయలతో ప్రొడక్షన్ లింక్‌డ్ ఇన్‌సెంటివ్ (పీఎల్‌ఐ) పథకానికి కేంద్రం ఆమోద ముద్ర వేసింది. ప్రధాని ఆధ్వర్యంలో జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో రూ.400 కోట్లతో మెడికల్ డివైజ్ పార్క్స్ స్కీమ్‌కు ఆమోదం తెలిపింది. పీఐఎల్ పథకం ద్వారా వచ్చే అయిదేళ్లలో రూ.68,437 కోట్ల రూపాయల విలువైన వైద్య పరికరాలను ఉత్పత్తి చేయవచ్చునని కేంద్రం అంచనా వేస్తోంది. జాతీయ ఆరోగ్య మిషన్ ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఆయుష్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. వీటి ఏర్పాటుకు రూ.3,399.35 కోట్లు అవుతాయని అంచనా. ఈ భేటీ వివరాలను మంత్రి జవదేకర్ వెల్లడించారు.



**ఎలక్ట్రానిక్ కంపెనీలకు రూ.40,995 కోట్లు**

ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ కంపెనీలకు రూ.40,995 కోట్ల ప్రొడక్షన్ లింక్‌డ్ ఇన్‌సెంటివ్స్‌ను ఇవ్వడానికి కేంద్రం ఆమోదం తెలిసింది. మేకిన్ ఇండియా హబ్‌ను రూపుదిద్దడం కోసం ఎలక్ట్రానిక్, మెడికల్ ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీకి వచ్చే అయిదేళ్లలో రూ.41వేల కోట్లు కేటాయించనున్నారు. దీంతో ఆయా రంగాలకు ఆర్థికంగా ఊతం వచ్చి 2025 నాటికి రూ.10 లక్షల కోట్లు ఆదాయం వస్తుందని కేంద్రం భావిస్తోంది. మరోవైపు పత్తి రైతులకు జరిగిన నష్టాన్ని పూరించడానికి రూ. 1,061 కోట్లు కేటాయించింది.

### అత్యవసర మందులు, పరికరాలు అందుబాటులో

కరోనా నేపథ్యంలో అత్యవసరమైన మందులు, వైద్య పరికరాలను దేశంలో తయారు చేసేందుకు ప్రభుత్వం రూ.14వేల కోట్లను మంజూరు చేసిందని మోదీ తెలిపారు. ఫార్మా సంస్థల యాజమాన్యాలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మోదీ మాట్లాడారు. అవసరానికి సరిపడిన ఆర్‌ఎన్‌ఏ డయాగ్నోస్టిక్ (కోవిడ్‌ను గుర్తించే) కిట్‌లను ఉత్పత్తి చేయాలని కోరారు. మందులు, పరికరాలను అవసరాల మేరకు తయారు చేయడంతోపాటు నూతన పరిష్కారాలను కనుగొనాలని కోరారు. కరోనా ముప్పును ఎదుర్కొనేందుకు అవసరమైన మందులు, పరికరాలను దేశీయంగా ఉత్పత్తి చేసేందుకు గాను రూ.14వేల కోట్ల విలువైన పథకాలను ఆమోదించామని మోదీ అన్నారు.

### కరోనాపై భయాలొద్దు
**కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీ**




**న్యూఢిల్లీ:** కరోనా వ్యాప్తి భయాందోళనలకు గురి కావద్దని కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీ దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వ్యాధి ప్రభావానికి గురైన అన్ని రంగాలకు సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. వైరస్ నిర్ధారణ పరీక్షా కేంద్రాల సంఖ్యను పెంచాలని, వీటితోపాటు చికిత్స అందించే ఆస్పత్రుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో ఉంచాలన్నారు. ఈ వ్యాధిపై పోరాటానికి మరిన్ని నిధులు అందుబాటులోకి తేవాలని సూచించారు. 'అసంఘటిత రంగాలకు చెందిన తాత్కాలిక ఉద్యోగులు, కార్మికులు, రైతులకు ఆర్థిక సాయం ప్రకటించాలి. దెబ్బతిన్న వివిధ రంగాల వారీగా సమగ్రమైన సహాయ ప్యాకేజీని ప్రభుత్వం అందించాలి' అని సోనియా కోరారు.

సాక్షి స్పోర్ట్స్
ఆదివారం
22-3-2020

# కోహ్లి అంటే నాకూ ఇష్టమే

## పాకిస్తాన్ క్రికెట్ దిగ్గజం మియాందాద్ వ్యాఖ్య





**కరాచీ:** భారత కెప్టెన్ విరాట్ కోహ్లి ఆటను అభిమానించే మాజీల జాబితాలో మరో క్రికెటర్ చేరాడు. పాకిస్తాన్ దిగ్గజ బ్యాట్స్‌మన్ జావేద్ మియాందాద్ కూడా కోహ్లి ఆటంటే తనకు ఇష్టమని వెల్లడించాడు. విరాట్ గొప్పతనం ఏమిటో అతని ఘనతలే చెబుతాయని మియాందాద్ అన్నాడు. 'భారత జట్టులో అత్యుత్తమ ఆటగాడు ఎవరని నన్ను కొందరు ప్రశ్నించారు. అప్పుడు నేను కోహ్లి పేరే చెప్పాను. నేను కొత్తగా అతని గురించి వివరించాల్సిందేమీ లేదు. అతని ప్రదర్శన, గణాంకాలు చూస్తే ఎవరైనా అంగీకరించాల్సిందే. దక్షిణాఫ్రికాలో అనూహ్యంగా స్పందించిన పిచ్‌పై కూడా అతను సెంచరీ చేశాడు. ఫాస్ట్ బౌలింగ్ అంటే భయపడతాడని, బౌన్సీ పిచ్‌లపై ఆడలేడని, స్పిన్‌ను ఎదుర్కోలేడని... ఇలా ఏ విషయంలోనైనా కోహ్లి గురించి ఎవరూ ప్రశ్నించలేరు. అతని సత్తా ఏమిటో అందరికీ తెలుసు. కోహ్లి చూడచక్కగా ఆడతాడు. అతని బ్యాటింగ్‌ను అలా చూస్తూ ఉండిపోవాలనిపిస్తుంది' అని మియాందాద్ ప్రశంసల వర్షం కురిపించాడు. 17 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో 124 టెస్టులు ఆడిన మియాందాద్ 52.57 సగటుతో 8832 పరుగులు చేసి పాక్ తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో రెండో స్థానంలో నిలిచాడు.



రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఇచ్చిన విందు కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులతో పాల్గొన్న భారత మహిళా దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ (వృత్తంలో)

# మేరీకోమ్ బాధ్యతారాహిత్యం!

- స్వీయ నిర్బంధంలో ఉండకుండా బయటకు
- రాష్ట్రపతి ఇచ్చిన విందుకు హాజరు
- ఎవరితోనూ కరచాలనం చేయలేదని వివరణ



పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్‌తో సిమ్రన్

**న్యూఢిల్లీ:** ఆమె ఒలింపిక్ పతక విజేత, ఆరుసార్లు ప్రపంచ చాంపియన్, జాతీయ రెండో అత్యున్నత పురస్కారం పద్మభూషణ్ గ్రహీత కావడంతో పాటు పార్లమెంట్ సభ్యురాలు కూడా. కానీ కరోనాతో దేశం అల్లకల్లోలమవుతున్న వేళ తన బాధ్యత మరచింది. విదేశాల నుంచి తిరిగి వచ్చిన తర్వాత కనీసం 14 రోజుల పాటు స్వీయ నిర్బంధంలో ఉండాలనే నిబంధనను ఉల్లంఘించింది. ఇదంతా భారత మహిళా బాక్సింగ్ దిగ్గజం మేరీకోమ్ గురించే. జోర్డాన్‌లో ఈ నెల 3 నుంచి 11 వరకు జరిగిన ఆసియా క్వాలిఫయింగ్ బాక్సింగ్ టోర్నీలో ఆమె పాల్గొంది. ఆ టోర్నీ నుంచి తిరిగి వచ్చిన భారత బాక్సర్లంతా రెండు వారాల పాటు బయటకు వెళ్లకుండా స్వీయ నిర్బంధంలో ఉండాలని బాక్సింగ్ సమాఖ్య ముందే చెప్పింది. దీనిని జట్టు సభ్యులంతా కచ్చితంగా పాటించాలని కోచ్ శాంటియాగో నీవా కూడా బాక్సర్లకు ముందే స్పష్టం చేసి దానికి తగినట్లుగా వారు ఇంట్లో చేసుకునేందుకు ఫిట్‌నెస్ షెడ్యూల్‌ను కూడా సూచించారు. ఈ బాక్సర్లంతా ఈ నెల 13న భారత్‌కు చేరుకున్నారు. కానీ మేరీకోమ్ మాత్రం దీనిని పట్టించుకున్నట్లుగా లేదు. ఈ నెల 18న రాష్ట్రపతి భవన్‌లో జరిగిన అల్పాహార విందులో ఆమె పాల్గొంది. రాష్ట్రపతి అధికారిక ట్విట్టర్ అకౌంట్ ద్వారా పోస్ట్ చేసిన చిత్రాలలో ఇతర పార్లమెంట్ సభ్యులతో పాటు మేరీకోమ్ కూడా ఉంది.

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఇచ్చిన విందులో తాను పాల్గొన్న విషయాన్ని మేరీకోమ్ కూడా నిర్ధారించింది. అయితే తాను ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదని ఆమె స్పష్టం చేసింది. 'జోర్డాన్ నుంచి వచ్చిన తర్వాత నేను ఇంట్లోనే ఉన్నాను. ఒక్క రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమానికి మాత్రమే వెళ్లాను. ఆ కార్యక్రమంలో ప్రస్తుతం స్వీయ నిర్బంధంలో ఉన్న రాజస్తాన్ సీఎం వసుంధర రాజే తనయుడు, పార్లమెంట్ సభ్యుడు దుష్యంత్ సింగ్‌ను కలవడం గానీ కరచాలనం చేయడం గానీ చేయలేదు. జోర్డాన్ పర్యటన తర్వాత నిర్దేశించిన నా స్వీయ నిర్బంధం ముగిసింది. అయినా సరే రాబోయే 3–4 రోజులు ఇంట్లోనే ఉంటాను' అని ఆమె స్పష్టం చేసింది.

### సిమ్రన్‌జిత్ కూడా...

మేరీకోమ్ కంటే ముందుగా భారత్‌కే చెందిన మరో మహిళా బాక్సర్ సిమ్రన్‌జిత్ కౌర్ కూడా స్వీయ నిర్బంధం నిబంధనను ఉల్లంఘించింది. జోర్డాన్‌లోనే జరిగిన ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో సిమ్రన్‌జిత్ పాల్గొని 60 కేజీల విభాగంలో ఫైనల్ చేరి టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. పంజాబ్ తరఫున ఈ ఘనత సాధించిన తొలి మహిళా బాక్సర్‌గా గుర్తింపు పొందింది. మార్చి 13న స్వదేశానికి తిరిగి వచ్చాక 14 రోజుల పాటు స్వీయ నిర్బంధంలో ఉండాల్సిన సిమ్రన్‌జిత్ మార్చి 16న పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్‌ను... రాష్ట్ర క్రీడల మంత్రి రాణా గుర్మీత్ సింగ్ సోధిని... శిరోమణి అకాలీదళ్ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌ను కలిసింది. టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించినందుకు సిమ్రన్‌జిత్‌కు పంజాబ్ ప్రభుత్వం రూ. 5 లక్షలు... శిరోమణి అకాలీదళ్ పార్టీ తరఫున సుఖ్‌బీర్ సింగ్ బాదల్ రూ. లక్ష నగదు పురస్కారం అందజేశారు. జోర్డాన్‌లోనూ కోవిడ్–19 వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోంది. ఇప్పటివరకు జోర్డాన్‌లో 69 కోవిడ్–19 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

# నమూనాల సేకరణలో జాగ్రత్త వహించండి

## అనుబంధ సంస్థలకు 'వాడా' కొత్త మార్గనిర్దేశకాలు

**మాంట్రియల్:** కరోనా విజృంభిస్తోన్న నేపథ్యంలో తమ అనుబంధ సంస్థలకు ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) నూతన మార్గనిర్దేశకాలు జారీ చేసింది. అథ్లెట్ల నుంచి నమూనాలు సేకరించే క్రమంలో కరోనా కారణంగా అధికారులతో పాటు, ఆటగాళ్లకు ఎలాంటి హాని కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది. స్థానిక ఆరోగ్య అధికారుల నిబంధనల మేరకు నడుచుకోవాలని డోపింగ్ నిరోధక సంస్థలకు సూచించింది. 'డోపింగ్ నియంత్రణ కోసం మనం పరీక్షలు నిర్వహించే సమయంలో అథ్లెట్లకు, అధికారుల ఆరోగ్యానికి తగిన రక్షణ కల్పించాలి. ఎలాంటి అనారోగ్యం లేని వారినే అథ్లెట్ల నుంచి శాంపుల్స్ సేకరించేందుకు ఉపయోగించాలి. ఈ క్రమంలో అథ్లెట్లను కూడా వారి ఆరోగ్యం గురించి ఆరా తీశాకే నమూనాలు సేకరించాలి' అని 'వాడా' పేర్కొంది. పని చేసే ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించింది. తప్పనిసరిగా మాస్క్‌లను వాడాలని హెచ్చరించింది.

# మహిళా క్రికెటర్లతో అసభ్య ప్రవర్తన

## కోచ్ అతుల్ బెదాడే సస్పెండ్



**వడోదర:** భారత మాజీ క్రికెటర్, ప్రస్తుతం బరోడా మహిళల జట్టుకు హెడ్ కోచ్‌గా ఉన్న అతుల్ బెదాడే తీవ్ర వివాదానికి కేంద్రంగా మారాడు. తాను కోచ్‌గా వ్యవహరిస్తున్న టీమ్ క్రికెటర్లతో అతను అసభ్యకరంగా ప్రవర్తించినట్లు విచారణలో తేలింది. దాంతో బెదాడేను సస్పెండ్ చేస్తున్నట్లు బరోడా క్రికెట్ సంఘం (బీసీఏ) ప్రకటించింది. ఈ మేరకు బెదాడేకు లేఖ రాసిన కార్యదర్శి అజిత్ లెలె పలు అంశాలు వెల్లడించారు. 'మహిళా క్రికెటర్ల శారీరక విషయాల గురించి, వారి ఆరోగ్య విషయాల గురించి వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం, అసభ్యకర భాష మాట్లాడటం, లైంగికపరమైన అంశాల గురించి కూడా చర్చించే ప్రయత్నం చేయడంలాంటివి'... బెదాడేపై వచ్చిన ప్రధాన ఆరోపణలని ఆయన చెప్పారు. క్రికెటర్ల రాతపూర్వక ఫిర్యాదు తర్వాత తాము విచారణ జరపడంతో అనేక విషయాలు బయటపడ్డాయని లెలె పేర్కొన్నారు. ప్రస్తుతానికి సస్పెండ్ చేసినా... ఈ అంశంపై ఇక ముందు పూర్తి స్థాయి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని కూడా బీసీఏ ప్రకటించింది. 53 ఏళ్ల అతుల్ బెదాడే 1994లో భారత్ తరఫున 13 వన్డేలు ఆడి 22.57 సగటుతో 158 పరుగులు చేశాడు.

# స్వీయ నిర్బంధంలో హామిల్టన్

## చారిటీ ఈవెంట్‌లో బ్రిటన్ రేసర్‌తో పాల్గొన్న వ్యక్తులకు కరోనా



**లండన్:** బ్రిటన్‌కు చెందిన దిగ్గజ రేసర్, ఆరుసార్లు ఫార్ములావన్ చాంపియన్ లూయిస్ హామిల్టన్ స్వీయ నిర్బంధంలో ఉన్నట్లు శనివారం తెలిపాడు. తనలో కరోనా వైరస్ లక్షణాలేమీ లేవని, అయినప్పటికీ ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా క్వారంటైన్‌లోకి వెళ్లిపోయానని అతను పేర్కొన్నాడు. స్టార్ రేసర్ అయిన 35 ఏళ్ల హామిల్టన్ ఈనెల 4న లండన్‌లో జరిగిన చారిటీ ఈవెంట్‌లో నటుడు ఇడ్రిస్ ఎల్బా, కెనడా ప్రధాని పియరీ భార్య సోఫీ గ్రెగోరీలతో కలిసి పాల్గొన్నాడు. అయితే తాజాగా ఎల్బా, సోఫీ కోవిడ్–19 పాజిటివ్‌గా తేలడంతో హామిల్టన్ స్వీయ నిర్బంధాన్ని పాటిస్తున్నట్లు చెప్పాడు. 'ఇడ్రిస్, సోఫీలను కలిసి 17 రోజులు దాటింది. నేను చాలా బాగున్నా. ఎలాంటి వైరస్ లక్షణాలు లేవు. వైద్యులు ఒకటికి రెండుసార్లు పరీక్షించి చెప్పారు' అని హామిల్టన్ తెలిపాడు.

# థామస్-ఉబెర్ కప్ టోర్నీ వాయిదా

## మే బదులుగా ఆగస్టులో నిర్వహణ





**కౌలాలంపూర్:** ప్రతిష్టాత్మక థామస్ కప్, ఉబెర్ కప్ ప్రపంచ పురుషుల, మహిళల వరల్డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మే 16 నుంచి 24 వరకు డెన్మార్క్ వేదికగా ఈ మెగా ఈవెంట్ జరగాల్సింది. అయితే కోవిడ్–19 వైరస్ యూరోప్‌తోపాటు ప్రపంచ వ్యాప్తంగా విజృంభిస్తుండటంతో ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) థామస్ కప్, ఉబెర్ కప్‌ను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. తాజా షెడ్యూల్ ప్రకారం డెన్మార్క్ వేదికగానే ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ ఆగస్టు 15 నుంచి 23 వరకు జరుగుతుంది. తొమ్మిది రోజులపాటు జరిగే ఈ టోర్నీలో పురుషుల విభాగంలో 16 జట్లు... మహిళల విభాగంలో 16 జట్లు టైటిల్ కోసం తలపడతాయి. ఈ టోర్నీలో రెండు విభాగాల్లోనూ భారత జట్లు అర్హత పొందాయి.

# టోక్యో ఒలింపిక్స్‌ను వాయిదా వేయాలి: శరత్



**న్యూఢిల్లీ:** ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్–19 వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో... టోక్యో ఒలింపిక్స్‌ను వాయిదా వేయాలని భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) అగ్రశ్రేణి క్రీడాకారుడు ఆచంట శరత్ కమల్ అభిప్రాయపడ్డాడు. పదేళ్ల విరామం తర్వాత 37 ఏళ్ల శరత్ కమల్ గతవారం ఒమన్ ఓపెన్ టోర్నమెంట్ టైటిల్‌ను సాధించాడు. సోమవారం స్వదేశానికి తిరిగి వచ్చి స్వీయ నిర్బంధంలోకి వెళ్లిన శరత్ కమల్... ప్రస్తుత గందరగోళ పరిస్థితుల్లో విశ్వ క్రీడలను నిర్వహించకపోవడమే మేలు అని అన్నాడు. ఏథెన్స్, బీజింగ్, రియో ఒలింపిక్స్ క్రీడల్లో ప్రాతినిధ్యం వహించిన శరత్ నాలుగోసారి ఒలింపిక్స్‌కు అర్హత సాధించే దిశగా అడుగులు వేస్తున్నాడు. 'ఓ క్రీడాకారుడిగా ఒలింపిక్స్ జరగాలనే కోరుకుంటున్నాను. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో మాత్రం కాదు. ప్రస్తుతం కోవిడ్–19 వైరస్ హడలెత్తిస్తోంది. అందరూ వ్యక్తుల మధ్య దూరం పాటించాలని సూచిస్తున్నారు. వేలాది మంది క్రీడాకారులు పాల్గొనే ఒలింపిక్స్‌లో ఇది సాధ్యం కాదు. క్రీడలు జరుగుతున్న సమయంలో వారందరూ ఒకే చోట కూడా ఉండాల్సి ఉంటుంది' అని శరత్ వ్యాఖ్యానించాడు.

# ఇంగ్లండ్‌లోనూ క్రికెట్ టోర్నీలు రద్దు

**లండన్:** కరోనా ప్రభావం ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) కీలక నిర్ణయం తీసుకునేలా చేసింది. మే 28 వరకు ఎలాంటి ప్రొఫెషనల్ క్రికెట్‌ను తాము నిర్వహించడం లేదని ఈసీబీ ప్రకటించింది. తాజా సీజన్‌ను ఆలస్యంగా ప్రారంభిస్తున్నట్లు ఈసీబీ వెల్లడించింది.

**శ్రీలంకలో కూడా:** శ్రీలంకలోనూ అన్ని రకాల దేశవాళీ క్రికెట్‌ను రద్దు చేస్తున్నట్లు లంక బోర్డు ప్రకటించింది. గత మంగళవారం శ్రీలంకలో ప్రతిష్టాత్మక వార్షిక స్కూల్ క్రికెట్ మ్యాచ్ జరిగింది. దీనికి భారీ సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యారు. వీరిలో ఒకరికి కరోనా ఉన్నట్లు బయటపడింది. దాంతో అందరిలో ఆందోళన నెలకొంది. నిజానికి ఈ మ్యాచ్‌ను ఆపేయాలని స్వయంగా దేశాధ్యక్షుడు గొటబాయ ఆదేశించినా నిర్వాహకులు దీనిని పట్టించుకోలేదు. తాజా ఘటన కారణంగా ఇప్పుడు దేశవ్యాప్తంగా క్రికెట్ పూర్తిగా రద్దయింది.

# ఫుట్‌బాలర్ జాహా ఔదార్యం

## తన అపార్ట్‌మెంట్‌లలో వైద్యులకు ఉచిత వసతి కల్పించిన ఐవరీకోస్ట్ ప్లేయర్

**లండన్:** కరోనా మహమ్మారిని తరిమికొట్టేందుకు నిరంతరాయంగా శ్రమిస్తోన్న వైద్యులకు సాంత్వన కల్పించేందుకు ఐవరీకోస్ట్ యువ ఫుట్‌బాలర్ విల్‌ఫ్రెడ్ జాహా ముందుకొచ్చాడు. లండన్‌లో తనకున్న 50 వాణిజ్య ప్రాపర్టీలను ఉచితంగా వైద్యుల వసతి కోసం కేటాయించాడు. ప్రీమియర్ లీగ్ క్లబ్‌లో క్రిస్టల్ ప్యాలెస్ జట్టుకు ప్రాతినిధ్యం వహించే జాహా ఈ లీగ్ ద్వారా వారానికి కోటి రూపాయలకు పైగా ఆర్జిస్తాడు. ఈ ప్రాపర్టీలను కార్పొరేట్ క్లయింట్ల అవసరాల కోసం అందుబాటులో ఉంచే జాహా... వీటిని ఇంటికి వెళ్లేంత సమయం లేని వైద్యుల వసతి కోసం ఇస్తున్నట్లు పేర్కొన్నాడు. 'మనం మంచి చేస్తే మనకు అదే తిరిగి వస్తుంది. నాకు జాతీయ ఆరోగ్య సేవా సంస్థలో పనిచేసే స్నేహితులు ఉన్నారు. వారు ఎలాంటి పరిస్థితుల్లో పనిచేస్తారో నాకు తెలుసు. ఆరోగ్య శాఖలో పనిచేసే వారు వీటిని ఉపయోగించుకోవచ్చు' అని జాహా పేర్కొన్నాడు.



జాహా కన్నా ముందు మాంచెస్టర్ యునైటైడ్ మాజీ స్టార్ ప్లేయర్ గ్యారీ నెవెలీ తన హోటల్స్‌లోని 176 గదులను, చెల్సీ యజమాని రోమన్ అబ్రామోవిచ్ 72 గదులను వైద్యుల కోసం కేటాయించారు.

# సెమీఫైనల్స్‌కు రిజర్వ్ డే కావాలి!

- ఐసీసీకి విజ్ఞప్తి చేయనున్న క్రికెట్ ఆస్ట్రేలియా
- వచ్చే అక్టోబరులో టి20 ప్రపంచ కప్

**సిడ్నీ:** ఇటీవలే ఆస్ట్రేలియాలో ముగిసిన మహిళల టి20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్ మ్యాచ్‌లకు రిజర్వ్ డే లేకుండా పోయింది. ఫలితంగా భారత్, ఇంగ్లండ్ మధ్య జరగాల్సిన తొలి సెమీస్ రద్దు కాగా... ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన రెండో సెమీస్‌లోనూ డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ద్వారా ఫలితం తేలింది. అయితే లీగ్ దశలో ఎక్కువ విజయాలు సాధించడంతో ఇంగ్లండ్‌ను వెనక్కి తోసి భారత్ ఫైనల్‌కు అర్హత సాధించింది. కీలకమైన సెమీస్‌కు కనీసం రిజర్వ్ డే పెట్టకపోవడంతో ఐసీసీపై తీవ్ర విమర్శలు వచ్చాయి. అయితే ప్రతిష్టాత్మక పురుషుల టి20 ప్రపంచకప్‌లో అలాంటి పరిస్థితి రాకూడదని ఆతిథ్య బోర్డు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) కోరుకుంటోంది. ఇప్పటికే అంగీకరించిన నిబంధనల ప్రకారం ఒక్క ఫైనల్ మ్యాచ్‌కు మాత్రమే రిజర్వ్ డే ఉంది. ఇప్పుడు సెమీఫైనల్స్‌కు కూడా రిజర్వ్ డే పెట్టమంటూ ఐసీసీకి విజ్ఞప్తి చేయాలని సీఏ నిర్ణయించింది. త్వరలో జరగనున్న ఐసీసీ క్రికెట్ కమిటీ సమావేశంలో సీఏ ఈ ప్రతిపాదన పెట్టనుంది. ఈ సమావేశంలో దీనిపై పూర్తి స్థాయిలో చర్చ జరుగుతుందని, అనంతరం చీఫ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ (సీఈసీ) ఆమోద ముద్ర వేస్తే తాజా ప్రతిపాదన అమల్లోకి వస్తుందని ఐసీసీ అధికార ప్రతినిధి ఒకరు వెల్లడించారు. మరి కొన్ని నెలల్లో టోర్నీ జరగనున్న నేపథ్యంలో నిబంధనలు మార్చడం అరుదుగా జరుగుతుందని, అయితే ఐసీసీ సభ్యదేశాల్లో ఎవరైనా వీటిని మార్చే విషయంపై చర్చ జరపవచ్చని ఆయన చెప్పారు. 'ఒక టోర్నీ జరిగిన తర్వాత మంచి చెడుల గురించి విశ్లేషించడం, రాబోయే టోర్నీకి ఎలా సన్నద్ధం కావాలో తెలుసుకోవడం ఎప్పుడైనా జరుగుతుంది. వేర్వేరు సమయంలో నిర్వహించినా టి20 ప్రపంచకప్ 2020కి సంబంధించి రెండు టోర్నీలకూ ఒకే తరహా నిబంధనలు మహిళా వరల్డ్ కప్ జరగక ముందే విధించారనేది వాస్తవం. అయితే నిబంధనల మార్పు గురించి మన వాదనలో వాస్తవం ఉండాలి. ఇంగ్లండ్ మహిళల జట్టు పరిస్థితి ఏమిటో మాకు బాగా తెలుసు. ఇప్పుడు మాలో చాలా మంది సెమీస్‌కు కూడా రిజర్వ్ డే ఉంటే బాగుంటుందని సూచిస్తున్నారు' అని సీఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కెవిన్ రాబర్ట్స్ అభిప్రాయ పడ్డారు. ఈ ఏడాది అక్టోబరు 18 నుంచి నవంబర్ 15 వరకు టి20 ప్రపంచ కప్ జరుగుతుంది.


**INDIAN INSTITUTES OF SCIENCE EDUCATION AND RESEARCH**
(Autonomous Institutions under MHRD, Government of India)
BERHAMPUR | BHOPAL | KOLKATA | MOHALI | PUNE | THIRUVANANTHAPURAM | TIRUPATI

**Admission to BS Degree and BS-MS Dual Degree Programmes 2020**
**Exciting opportunities in Science for inquisitive and enthusiastic young minds**

Applications are invited from highly motivated students studying in the science stream for admission to 4-Year BS and 5-Year BS- MS Dual Degree Programmes in Indian Institutes of Science Education and Research (IISERs) at Berhampur, Bhopal, Kolkata, Mohali, Pune, Thiruvananthapuram and Tirupati for the academic session commencing from August 2020.

**Eligibility**

Candidates who have passed Class XII/equivalent examination in science stream (in 2019 or 2020) and meet the cut off criteria specified by IISER Admission Board are eligible for admission through one or more of the following channels:
- **State and Central Boards (SCB)**
- **Kishore Vaigyanik Protsahan Yojana (KVPY)**
- **JEE (Advanced)**

For more information, please visit **http://www.iiseradmission.in**

**Application Procedure**

1. Applications for admission are to be submitted online only at **www.iiseradmission.in**
2. Instructions for filling the application form and other relevant details are available on the website.
3. Applicants are advised to go through the FAQ section in the website carefully before filling up the form.
4. A non-refundable application fee of ₹2000 (₹1000 for SC/ST and PD candidates) is applicable.

**Attractive Features**

- 5-Year BS-MS dual degree programmes in Sciences
- 4-Year BS programme in Engineering Science and Economic Sciences (at IISER Bhopal only)
- Classroom learning accentuated with research
- Curriculum that is topical with sufficient breadth and depth
- Fully residential campuses with well-equipped hostels
- Access to on-campus medical, sports and other recreational facilities

**Scholarship**

1. Students admitted through KVPY channel will be eligible for scholarships as per KVPY norms.
2. Students admitted through JEE (Advanced) and SCB channels will be eligible for a limited number of INSPIRE fellowships as per the Department of Science and Technology, Government of India norms.

| Important Dates | SCB | KVPY | JEE (Advanced) |
|---|---|---|---|
| Application portal opens on | 23 March 2020 | 24 April 2020 | 1 June 2020 |
| Last date for online applications | 30 April 2020 | 22 May 2020 | 15 June 2020 |
| **IISER Aptitude test** | **31 May 2020** | | |

All inquiries must be addressed to: **Chairperson, Joint Admissions Committee 2020**
**Phone:** 0471-2778182, 8200 (10.00 AM to 2.00 PM working days), **Email:** ask-jac2020@iisertvm.ac.in
**Website:** http://www.iiseradmission.in

## బీసీ జనగణన గర్జన వాయిదా

సాక్షి, హైదరాబాద్: జనగణనలో భాగంగా బీసీ జనాభాను లెక్కించాలనే డిమాండ్‌తో ఈ నెల 23న ఢిల్లీలో తలపెట్టిన బీసీ జనగణన గర్జనను వాయిదా వేస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు ఈ నెల 22న దేశవ్యాప్తంగా విధించిన జనతా కర్ఫ్యూకు బీసీ సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానున్న జనగణనను వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని జాజుల డిమాండ్ చేశారు.

## నేటి స్పాట్ వాల్యుయేషన్ రద్దు

సాక్షి, హైదరాబాద్: జనతా కర్ఫ్యూ నేపథ్యంలో ఆదివారం జరగాల్సిన ఇంటర్మీడియెట్ జవాబుపత్రాల మూల్యాంకనాన్ని ఇంటర్ బోర్డు నిలిపేసింది. కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించే క్రమంలో దేశవ్యాప్తంగా చేపట్టిన జనతా కర్ఫ్యూతో వాల్యుయేషన్ చేసే సిబ్బందికి ఇబ్బంది కలగకుండా ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. తిరిగి సోమవారం యథావిధిగా వాల్యుయేషన్ కొనసాగుతుందని బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది.

## టీజేఎస్ బీసీ సెల్ కన్వీనర్‌గా బలరాం

సాక్షి, హైదరాబాద్: తమ పార్టీ బీసీ సెల్ కన్వీనర్‌గా ఆవుల బలరాంను నియమించినట్లు తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధ్యక్షుడు కోదండరాం తెలిపారు. రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో ఈ విభాగం నిర్మాణం పూర్తిచేసి, బీసీ సెల్ నిర్మాణం బలోపేతానికి రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులంతా సహకరించాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తిచేశారు.

## జనతా కర్ఫ్యూను విధిగా పాటించండి: ట్రెసా

సాక్షి, హైదరాబాద్: కోవిడ్–19 నియంత్రణకు రెవెన్యూ ఉద్యోగులు అలుపెరగకుండా కృషి చేస్తున్నారని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వంగా రవీందర్‌రెడ్డి, గౌతమ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విదేశాల నుంచి వచ్చిన వ్యక్తులను క్వారంటైన్/ ఐసోలేషన్ కేంద్రాలకు తరలించడమేగాకుండా.. మెడికల్, పోలీస్ విభాగాలను సమన్వయపరుచుకుంటూ ముందుకు సాగుతున్నారని అన్నారు. అలాగే విదేశాల నుంచి వచ్చిన పౌరులకు కరోనా లక్షణాలు లేకుంటే ఇంట్లోనే 14 రోజులు క్వారంటైన్/ ఐసోలేషన్ చేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణే కాకుండా జిల్లాల్లో మాస్కులను కూడా పంపిణీ చేసి.. సామాజిక సేవలో పాలుపంచుకుంటున్నట్లు చెప్పారు. ప్రధాని, సీఎం ఆదేశాలకు అనుగుణంగా ఆదివారం 'జనతా కర్ఫ్యూ'ను నిర్వహించాలని, ప్రజలంతా ఇంట్లోనే ఉండటం ద్వారా కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా అడ్డుకట్ట వేయాలని ఉద్యోగులు, ప్రజలకు వారు పిలుపునిచ్చారు.

## కోవిడ్ నివారణకు దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం

### సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ

సాక్షి, హైదరాబాద్: కోవిడ్‌ను నివారించే వరకు దీర్ఘకాలిక ప్రణాళిక ఉండాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పేర్కొంది. ప్రధాని మోదీ పిలుపునిచ్చిన జనతా కర్ఫ్యూ మేరకు ఒక్కరోజు కర్ఫ్యూతోనే సమస్య పరిష్కారం కాదని ఈ అంటువ్యాధి నివారణకు నిర్దిష్ట, నిర్మాణాత్మక చర్యలు అవసరమని అభిప్రాయపడింది. ప్రజలకు భరోసాతో కూడిన బాధ్యతను చైతన్యంతో అందించాలని, మాల్స్, హోటల్స్, స్కూల్స్, థియేటర్స్ మూతపడి కార్మికులకు పనిలేకుండా పోయిందని, వీరికి ప్రభుత్వం ఆర్థికంగా రూ.5 వేల సహాయం ప్రకటించాలని కోరింది. నిత్యావసరాలు ప్రజలకు అందించాలని, ప్రభుత్వ యంత్రాంగం మొత్తం జబ్బు నివారణ కృషిలో నిమగ్నం కావాలని తెలిపింది. గ్రామాలు, మున్సిపాలిటీలకు శానిటేషన్ కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆ పార్టీ సహాయ కార్యదర్శి పోటు రంగారావు విజ్ఞప్తిచేశారు.

## ఇద్దరు అటవీ అధికారులపై సస్పెన్షన్ వేటు

సాక్షి, హైదరాబాద్: హరితహారం కార్యక్రమం నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన మరో ఇద్దరు అధికారులపై అటవీశాఖ సస్పెన్షన్ వేటు వేసింది. కొమురంభీం జిల్లా బెజ్జూర్ రేంజ్ పరిధిలోని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోశెట్టి, బీట్ ఆఫీసర్ వందనలను సస్పెండ్ చేసింది. హరితహారంలో మొక్కలు నాటి, వాటి సంరక్షణ చర్యలు, అడవుల పునరుద్ధరణకు సంబంధించి కంపా నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణలపై అటవీశాఖ స్పందించి చర్యలు చేపట్టింది. శుక్రవారం బెజ్జూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కిరణ్‌కుమార్‌ను సస్పెండ్ చేయగా, శనివారం మరో ఇద్దరిపై వేటుపడింది. వీరిపై వచ్చిన ఆరోపణలపై ఆదిలాబాద్ చీఫ్ కన్జర్వేటర్‌తో విచారణ జరిపించిన అనంతరం, వారిద్దరిని సస్పెండ్ చేస్తూ శనివారం పీసీసీఎఫ్ ఆర్.శోభ ఉత్తర్వులు జారీచేశారు.

## ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ వాయిదా వేయాలి

### ఎమ్మెల్సీ రామచంద్రరావు

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ వ్యాప్తిపై భయాందోళనలు నెలకొన్న నేపథ్యంలో ఇంటర్మీడియెట్ జవాబు పత్రాలను దిద్దేందుకు చేపడుతున్న స్పాట్ వాల్యుయేషన్‌ను వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి బీజేపీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు విజ్ఞప్తిచేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు పదో తరగతి పరీక్షలను వాయిదా వేసిన విధంగానే, ఇంటర్ స్పాట్‌వాల్యుయేషన్‌ను కూడా వాయిదా వేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. వైరస్ వ్యాప్తిపై ఆందోళనలు వ్యక్తమవుతున్నందున రాష్ట్రవ్యాప్తంగా స్పాట్‌వాల్యుయేషన్ సెంటర్లకు వచ్చేందుకు టీచర్లు జంకుతున్నారని, అందువల్ల కొన్ని రోజుల పాటు దీన్ని వాయిదా వేయాలని ప్రభుత్వానికి విన్నవించారు.

## అరణ్యభవన్‌లో కోవిడ్‌పై జాగ్రత్తలు...

సాక్షి, హైదరాబాద్: కోవిడ్–19 వ్యాప్తిపై భయాందోళనలు నెలకొన్న నేపథ్యంలో అరణ్యభవన్‌లో పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. శనివారం అరణ్యభవన్ ప్రధాన ద్వారం వద్ద అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, పీసీసీఎఫ్ ఆర్.శోభలకు శరీర ఉష్ణోగ్రతలు పరీక్షించి శానిటైజర్ అందజేశారు. అదేవిధంగా విధులకు హాజరైన అధికారులు, సిబ్బందిని కూడా పరీక్షించి, శానిటైజర్‌ను అందించారు. అరణ్యభవన్ కార్యాలయ ప్రాంగణం, ఆఫీసులు, సెక్షన్లలో సైతం శుభ్రత చర్యలు చేపట్టి సానిటైజ్ చేశారు.

## నేడు సింగరేణి బొగ్గు గనులు, కార్యాలయాలు బంద్

### సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ వ్యాప్తి నియంత్రణకు ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన జనతా కర్ఫ్యూ పిలుపు మేరకు ఆదివారం సింగరేణి బొగ్గు గనుల సంస్థ పరిధిలోని 18 ఓపెన్‌కాస్ట్, 27 భూగర్భ గనులతో పాటు కార్యాలయాలను కూడా మూసివేయాలని సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశించారు. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ సాధారణంగా అన్ని ఓపెన్‌కాస్ట్ గనులు, కొన్ని భూగర్భ గనులు యథావిధిగా పనిచేస్తుంటాయి. కార్మికులు వారి కుటుంబ సభ్యులు ఉదయం 6 గంటల నుండి సోమవారం ఉదయం 6 గంటల వరకు స్వీయ నియంత్రణతో తమ ఇళ్లకే పరిమితమై ఉండాలని యాజమాన్యం కోరింది.



కోవిడ్ ఇప్పుడు కొత్త ఉపాధి కల్పిస్తోంది. వ్యాధి నియంత్రణ చర్యల్లో భాగంగా ధరించే మాస్కులకు డిమాండ్ ఏర్పడటంతో హైదరాబాద్‌లోని ఓ కుటుంబం సొంతంగా మాస్కులను తయారు చేసి సరూర్‌నగర్ స్టేడియం ముందు విక్రయిస్తున్న దృశ్యం

## ఏప్రిల్ 1 నుంచి ప్రస్తుత విద్యుత్ చార్జీలే

### ఈఆర్సీ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానున్న కొత్త ఆర్థిక సంవత్సరం (2020–21)కు సంబంధించిన విద్యుత్ చార్జీలను ప్రకటిస్తూ, టారిఫ్ ఉత్తర్వులు జారీ చేసే వరకు రాష్ట్రంలో ప్రస్తుత చార్జీలే అమలవుతాయని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్‌ఈఆర్సీ) శుక్రవారం ఆదేశించింది. ఏప్రిల్ 1 నుంచి తదుపరి టారిఫ్ ఉత్తర్వులు జారీ చేసే వరకు ప్రస్తుత చార్జీలే కొనసాగుతాయని స్పష్టం చేసింది. 2020–21కి సంబంధించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్‌ఆర్) సమర్పించేందుకు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు మార్చి 31 వరకు గడువు పొడిగింపు కోరిన నేపథ్యంలో ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపును అమలు చేయడం సాధ్యం కాలేదు. రాష్ట్రంలో నిర్మిస్తున్న భారీ ఎత్తిపోతల పథకాలకు అవసరమైన విద్యుత్ అంచనాల తయారీకి మరింత సమయం కావాలని డిస్కంలు కోరాయి. డిస్కంలు ఏఆర్‌ఆర్ సమర్పించిన తర్వాత ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి కొత్త టారిఫ్‌ను ఈఆర్సీ ప్రకటించనుంది. ఇదిలా ఉండగా, 2020–21లో డిస్కంలకు సబ్సిడీ రూపంలో రూ.10,095 కోట్లు చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఈఆర్సీకి లేఖ రాసింది. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని తాజాగా ఈఆర్సీ విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని వాయిదా వేసింది.

# కోవిడ్ లక్షణాలుండి సహకరించకుంటే కేసు

**ఐసోలేషన్ లేదా ఆస్పత్రిలో చేరేందుకు నిరాకరిస్తే కఠిన చర్య**

- అంటువ్యాధుల నియంత్రణ చట్టం–1897ను అమల్లోకి తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- తెలంగాణ అంటువ్యాధుల (కోవిడ్) నియంత్రణ–2020 నోటిఫికేషన్
- ప్రజారోగ్య డైరెక్టర్, డీఎంఈ, వైద్య విధాన కమిషనర్, కలెక్టర్లు, ఎస్పీలు, మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లకు ప్రత్యేకాధికారాలు

సాక్షి, హైదరాబాద్: కోవిడ్‌పై అంటువ్యాధుల నివారణ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగించింది. ఈ మేరకు అంటువ్యాధుల నియంత్రణ చట్టం–1897కు అనుగుణంగా తెలంగాణ అంటు వ్యాధుల (కోవిడ్) నియంత్రణకు సంబంధించిన నోటిఫికేషన్‌ను శనివారం రాత్రి విడుదల చేసింది. దాని ప్రకారం ఎవరైనా కోవిడ్ అనుమానిత లక్షణాలుండి ఆస్పత్రిలో చేరేందుకు కానీ, ఐసోలేషన్‌లో ఉండేందుకు కానీ నిరాకరిస్తే ఐపీసీ సెక్షన్ 188 కింద కేసు పెట్టాలని స్పష్టం చేసింది. వీటిని అమలు చేసే బాధ్యతలను కలెక్టర్లు, ఎస్పీలు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు, ప్రజారోగ్య డైరెక్టర్, డీఎంఈ, వైద్య విధాన కమిషనర్లకు ప్రత్యేక అధికారాలు కల్పించింది. తక్షణమే ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని, ఇది ఏడాది పాటు చెల్లుబాటులో ఉంటుందని తెలిపింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ కోవిడ్‌ను మహమ్మారిగా ప్రకటించినందున, దాని నియంత్రణకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు తమ వద్దకు వచ్చే కోవిడ్ అనుమానాస్పద కేసులను పరీక్షించి, పైన పేర్కొన్న అధికారులకు సమాచారం అందించాలి. వ్యక్తుల ప్రయాణ చరిత్రను తెలుసుకోవాలి. ఆ వివరాలను నమోదు చేయాలి.

- అవసరమైనప్పుడు పైన పేర్కొన్న అధికారులు ఆదేశిస్తే ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులన్నీ కోవిడ్ నిర్ధారణకు సంబంధించిన విభాగాలు ఏర్పాటు చేసుకొని అనుమానిత కేసులకు పరీక్షలు నిర్వహించాలి.
- గత 14 రోజుల్లో ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చారా లేదా తెలుసుకోవాలి. ప్రయాణ చరిత్ర ఉన్నా లేకపోయినా వారు 14 రోజులు ఇంటి నిర్బంధంలో ఉండాలి. లక్షణాలుంటే ఆస్పత్రికి తరలించాలి. కేంద్రం జారీచేసిన గృహ నిర్బంధ మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలి.
- గృహ నిర్బంధ మార్గదర్శకాలను పాటించని వ్యక్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్వారంటైన్లలో ఉంచాలి.
- ప్రయాణ చరిత్ర, లక్షణాలతో ఉన్న ప్రతి వ్యక్తిని ప్రొటోకాల్ ప్రకారం ఆస్పత్రిలో ఉంచాలి.
- అలాంటి కేసులన్నింటినీ వెంటనే రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ యూనిట్‌కు పంపాలి. జిల్లా కలెక్టర్ లేదా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు సమాచారం ఇవ్వాలి.
- కలెక్టర్ లేదా ప్రజారోగ్య డైరెక్టర్ తదితరుల అనుమతి లేకుండా, వారు కేసులను నిర్ధారణ చేయకుండా పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలో ప్రచారం చేయడం, ముద్రించడం తగదు. అవాస్తవాలను ప్రచారం చేస్తే, పుకార్లను వ్యాపింపజేస్తే ఈ నిబంధనల ప్రకారం శిక్షార్హమైన నేరంగా పరిగణిస్తారు.
- కోవిడ్‌ను పరీక్షించాలనుకునే ప్రైవేట్ ఆరోగ్య సంరక్షణ సంస్థలు రాష్ట్ర ఐడీఎస్పీ యూనిట్‌కు తెలపాలి. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం రాష్ట్ర ఐడీఎస్పీ యూనిట్ వీటిని పర్యవేక్షిస్తుంది.
- కోవిడ్ ప్రభావిత దేశం లేదా ప్రాంతం నుంచి గత 14 రోజుల్లో ప్రయాణ చరిత్ర ఉన్న ఎవరైనా, స్వచ్ఛందంగా స్టేట్ కంట్రోల్ రూం (040–24651119) లేదా టోల్ ఫ్రీ నంబర్ 104కు సమాచారం ఇవ్వాలి.
- కోవిడ్ లక్షణాలున్న వారు ఐసోలేషన్‌కు నిరాకరిస్తే, ఆస్పత్రికి రావడానికి ఇబ్బంది పెడితే ఆ వ్యక్తిపై చట్టప్రకారం చర్యలుంటాయి.
- జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ తదితరులకు అనేక అధికారాలు ఇచ్చారు. తమ పరిధిలో కోవిడ్ వ్యాప్తి జరగకుండా చర్యలు తీసుకోవాలి. సినిమా హాళ్ల మూసివేత, స్విమ్మింగ్ పూల్స్, జిమ్‌లు, సామూహిక సమావేశాలను నిషేధించడం, పాఠశాలలు, కార్యాలయాలను మూసేయాలి.
- ఈ నిబంధనలను ఉల్లంఘించే వ్యక్తి, సంస్థలను శిక్షార్హమైన నేరానికి పాల్పడినట్లుగా పరిగణిస్తారు. అవసరమైతే జరిమానా విధించొచ్చు.

## కోవిడ్‌పై నిపుణుల కమిటీ ఏర్పాటు

### ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్



సాక్షి, హైదరాబాద్: కోవిడ్ నియంత్రణకు ప్రపంచంలోని వివిధ దేశాలు తీసుకుంటున్న చర్యలతో పాటు చోటు చేసుకుంటున్న పరిణామాలపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు అందించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సీసీఎంబీ డైరెక్టర్ కె.రాకేశ్ మిశ్రా, కాళోజీ నారాయణరావు హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ బి.కరుణాకర్ రెడ్డి, ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, నిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ టి.గంగాధర్, హెచ్ఎంఆర్ఐ సీఈఓ బాలాజీ ఉట్ల ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

## దేవాదాయశాఖ ఆఫీసులో పంచాంగపఠనం

- ప్రజలకు అనుమతి లేదు
- భద్రాచలం ఆలయ ప్రాంగణంలోనే రాముడి కల్యాణం
- పట్టువస్త్రాలు సమర్పించనున్న దేవాదాయశాఖ మంత్రి



సాక్షి, హైదరాబాద్: కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో అటు ఉగాది పంచాంగ శ్రవణాన్ని, ఇటు భద్రాద్రిలో జరిగే సీతారామ కల్యాణాన్ని నిరాడంబరంగానే నిర్వహించి ఈ రెండు కార్యక్రమాలను చానళ్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉగాది పంచాంగ శ్రవణానికి సంబంధించిన అధికారిక కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. గతంలో ఈ వేడుకను రవీంద్రభారతిలో, ఆ తర్వాత ప్రగతిభవన్‌లో నిర్వహిస్తూ రావటం ఆనవాయితీ. కేవలం అధికారుల సమక్షంలో జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎవరికీ అనుమతి లేదని మంత్రి స్పష్టం చేశారు. అదేవిధంగా భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయంలో నిర్వహించే సీతారామ కల్యాణాన్ని కూడా నిరాడంబరంగా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి ఏటా మిథిలా స్టేడియంలో నిర్వహించే ఈ వేడుకల్ని ఈసారి ఆలయ మండపంలోనే భక్తులు లేకుండానే వేద పండితులు, అర్చకులు, అధికారుల సమక్షంలో మాత్రమే చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధుల తోపాటు ప్రభుత్వ పక్షాన పట్టువస్త్రాలు సమర్పించేందుకు తాను హాజరవనున్నట్టు మంత్రి పేర్కొన్నారు. ఈ వేడుకలకు సంబంధించి ఆహ్వానపత్రాలు కూడా ముద్రించలేదన్నారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకున్నవారికి డబ్బులు వాపసు చేస్తామని, వారందరికీ పోస్టు ద్వారా స్వామి కల్యాణ తలంబ్రాలు అందించనున్నట్టు ప్రకటించారు. ఇతర దేవాలయాల్లో కూడా ఈ వేడుకలను నిరాడంబరంగా నిర్వహించుకోవాలని సూచించారు. కోవిడ్ వైరస్ విజృంభణ నేపథ్యంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సుదర్శనహోమాలు, మృత్యుంజయ హోమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు రమణాచారి, కమిషనర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ప్రయాణికులకు హోం క్వారంటైన్ ముద్రలు

శంషాబాద్: అంతర్జాతీయ ప్రయాణికులకు హోం క్వారంటైన్ చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు శనివారం సాయంత్రం వివిధ దేశాల నుంచి వచ్చిన పలువురు ప్రయాణికులకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో హోం క్వారంటైన్ ముద్రలు వేశారు. ఈనెల 31న హోం క్వారంటైన్ చేయాల్సిందిగా ఆ ముద్రల్లో రాసి ఉంది. ఈ సమయంలో కోవిడ్ అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలో ప్రభుత్వాసుపత్రికి వెళ్లాల్సిందిగా సూచిస్తున్నారు.

## 'క్వారంటైన్' సౌకర్యాల లేమిపై స్పందించిన హైకోర్టు

### పత్రికా కథనాలను పిల్‌గా పరిగణన

సాక్షి, హైదరాబాద్: విదేశాల నుంచి వచ్చిన ప్రయాణికులను 14 రోజులపాటు క్వారంటైన్‌లో ఉంచే గదుల్లో తగిన సౌకర్యాలు ఉండటం లేదంటూ పత్రికల్లో వచ్చిన వార్తా కథనాలపై హైకోర్టు స్పందించింది. ఈ కథనాలను సుమోటోగా పరిగణించింది. ఒకే గదిలో ఇద్దరు, ముగ్గురిని ఉంచుతున్నారని, ఆ గదుల్లో ఏ మాత్రం పరిశుభ్రత లేకపోవడం, దోమలు, నల్లులు ఉంటున్నట్లు ఆ కథనాల్లో వచ్చిందని ఆ పిల్‌లో పేర్కొంది. మరుగుదొడ్లలో కనీసం నీటి వసతి కూడా లేని విషయాన్ని ప్రస్తావించింది. ఈ వ్యాజ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, జీహెచ్ఎంసీ కమిషనర్ తదితరులను ప్రతివాదులుగా పేర్కొంది. ఈ వ్యాజ్యంపై సోమవారం ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపే అవకాశం ఉంది.

## పురపాలికల్లో క్వారంటైన్ కేంద్రాలు

### పురపాలక శాఖ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కోవిడ్–19 వ్యాప్తి తీవ్రమవుతున్న నేపథ్యంలో కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సూచన మేరకు రాష్ట్రంలోని అన్ని పురపాలికల్లో క్వారంటైన్ కేంద్రాలు, తాత్కాలిక ఆస్పత్రుల ఏర్పాటుకు అవసరమైన భవనాలను గుర్తించాలని మున్సిపల్ కమిషనర్లకు పురపాలక శాఖ డైరెక్టర్ ఎన్.సత్యనారాయణ ఆదేశాలు జారీచేశారు. కోవిడ్–19 వ్యాప్తి, నివారణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పురపాలికల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు.

**కార్యాలయాల్లో ఏసీల నియంత్రణ**

ఏసీ ద్వారా కోవిడ్ వ్యాప్తి చెందే అవకాశాలుండటంతో అన్ని ప్రభుత్వ విభాగాల కార్యాలయాల్లో ఏసీల వినియోగంపై నియంత్రణ పాటించాలని పురపాలక శాఖ కార్యదర్శి సి.సుదర్శన్ రెడ్డి ఆదేశించారు.




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.